
ఆంధ్రజ్యోతి
ANDHRAJYOTHY
కరీంనగర్
జిల్లా వార్తలు
3
బుధవారం 4 డిసెంబరు 2024



ఈ నెల 7న ఆటోల బంద్

సుభాష్‌నగర్, డిసెంబరు 3(ఆంధ్రజ్యోతి): రాష్ట్ర ప్రభుత్వం ఆటో డ్రైవర్లను ఆదుకోవాలనే డిమాండ్‌తో తెలంగాణ రాష్ట్ర ఆటో జేఏసీ ఆధ్వర్యంలో ఈనెల 7న రాష్ట్ర వ్యాప్తంగా ఆటోల బంద్‌కు పిలుపు ఇచ్చినట్లు జేఏసీ రాష్ట్ర అధ్యక్షుడు మంద రవికుమార్ తెలిపారు. మంగళవారం నగరంలోని ప్రెస్‌భవన్‌లో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో మాట్లాడారు. సమావేశంలో ఉమ్మడి జిల్లా ఇంచార్జీ, నగర అధ్యక్షుడు మద్దెల రాజేందర్, టీఏటీయూ రాష్ట్ర ఉపాధ్యక్షుడు బొమ్మిడి శ్రీనివాస్‌రెడ్డి, బండారి సంపత్ తదితరులు పాల్గొన్నారు.

గురుకులాల్లో గజగజ

పరిశీలన

- విద్యార్థులకు అందని దుప్పట్లు
- కిటికీలు, తలుపులు లేక ఇబ్బందులు
- దోమలతో జ్వరాలపాలవుతున్న విద్యార్థులు

(ఆంధ్రజ్యోతి ప్రతినిధి, కరీంనగర్)

కార్పొరేట్ కళాశాలలను తలదన్నే విధంగా విద్యను అందిస్తున్నాం... సకల సౌకర్యాలు కల్పించి బడుగుబలహీనవర్గాల పిల్లలకు నాణ్యమైన విద్యనందించి వారి జీవితాలకు బంగారు బాట వేస్తున్నాం.. అని ప్రభుత్వం చెబుతున్నా ఆచరణలో అందుకు భిన్నంగా కనిపిస్తున్నది. గొంతు దిగని ముద్ద అన్నం, కనీస వసతులు కరువై చలికి వణుకుతూ దోమకాటుతో జ్వరాలపాలవుతూ విద్యార్థులు ఇళ్లకో... ఆసుపత్రులకో... వెళ్లాల్సిన పరిస్థితి ఉంది. ఎస్సీ, ఎస్టీ, బీసీ, మైనార్టీ గురుకులాలను ఏర్పాటు చేసిన ప్రభుత్వం వాటికి స్వంత భవనాలు నిర్మించకపోవడంతో అద్దెభవనాల్లో అరకొర సౌకర్యాలతో విద్యార్థులు తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొంటున్నారు. ఎక్కడో ఒక చోట... ఎవరో ఒకరు ఆసుపత్రి పాలుకావడం, కలుషిత ఆహారం తిని అనారోగ్యానికి గురికావడం నిత్యకృత్యమైపోయింది.



ప్రహరీ లేని ఇల్లందకుంట కస్తూర్బా గాంధీ బాలికల పాఠశాల



ఇల్లందకుంట కస్తూర్బా గాంధీ బాలికల పాఠశాలలో నిలిచిన డ్రైనేజీ నీళ్లు



గంగాధర బాలుర గురుకుల పాఠశాలలో పనిచేయని ఆర్వో ప్లాంటు

విద్యార్థులకు అందని సౌకర్యాలు

కరీంనగర్ జిల్లాలో 12 బీసీ, 8 ఎస్సీ, 9మైనార్టీ, ఒక గిరిజన గురుకులాలు ఉన్నాయి. జిల్లాలో ఉన్న 30గురుకుల పాఠశాలల్లో 25 అద్దె భవనా ల్లోనే కొనసాగుతున్నాయి. కేవలం ఒక బీసీ, నాలుగు ఎస్సీ గురుకులాలను స్వంత భవనాల్లో ఉన్నప్పటికీ అక్కడ కూడా విద్యార్థులకు మెరు గైన సౌకర్యాలు అందడం లేదనే విమర్శలు ఉన్నాయి. 12 బీసీ గురుకులాల్లో 5,253 మంది విద్యార్థులు, తొమ్మిది మైనార్టీల్లో 3,500 మంది, నాలుగు ఎస్సీ గురుకులాలో 3,230 మంది, గిరిజన గురుకులంలో 325మంది విద్యార్థులు విద్యనభ్యసిస్తున్నారు. ఓవైపు చలి తీవ్రత రోజురోజుకు అధికమవుతూ రాత్రి ఉష్ణోగ్రతలు 15 డిగ్రీలకు పడిపోతున్నా గురుకులాల్లో చదివే విద్యార్థులకు దుప్పట్లను కూడా పంపిణీ చేయలేదు. దీనితో చలి తీవ్రతను తట్టుకోలేక విద్యార్థులు ఇబ్బందులు పడుతున్నారు. కొంత మంది విద్యార్థులు ఇళ్ల నుంచి దుప్పట్లు తెచ్చుకుంటున్నా చలితీవ్రత తట్టుకోలేక జలుబు, జ్వరం వంటి అనారోగ్యాలకు గురవుతున్నారు.

..మిగతా 6లో



రామడుగు గురుకుల పాఠశాలలో తలుపులేని కిటికీలు

ఇదీ పరిస్థితి

- ఇల్లందకుంట మండలంలోని కస్తూర్బాగాంధీ బాలికల పాఠశాలలో 275 మంది విద్యనభ్యసిస్తుండగా పాఠశాలలో డ్రైనేజీ సౌకర్యం, ప్రహరీ లేకపోవడంతో రాత్రివేళల్లో విద్యార్థినిలు భయాందోళనకు గురవుతున్నారు.
- గంగాధర మండలంలో అద్దె భవనాల్లో నిర్వహిస్తున్న జ్యోతి బాపూలే బాలికల, బాలుర పాఠశాలకు కిటికీలు, తలుపులు లేక పోవడంతో చలితీవ్రతను తట్టుకోలేక విద్యార్థులు ఇబ్బందులు పడుతున్నారు. ఇప్పటికే బాలుర వసతి గృహంలోని ముగ్గురు విద్యార్థులు జలుబు, జ్వరంతో బాధపడుతుండగా, మరికొంత మంది జలుబు, ఇతర అనారోగ్యాల ఇబ్బంది పడుతున్నారు. బాలికల పాఠశాలలో వంటశాల గది ఇరుకుగా ఉండటం, ఆర్వో సిస్టం సంవత్సర కాలంగా మరమ్మతులు చేయకపోవడంతో ఆటోలో ప్రైవేట్‌గా ప్లాంటు నీళ్లు ఇవ్వడంతో విద్యార్థులు పలు అనారోగ్యాలకు గుర వుతున్నారు.
- కరీంనగర్, వీణవంక, హుజురాబాద్ మండలంలోని బీసీ హాస్టల్ లోని విద్యార్థులకు దుప్పట్లు ఇవ్వక పోవడంతో చలితీవ్రతను తట్టుకోలేక పోతు న్నారు.
- తిమ్మాపూర్ మండల కేంద్రంలో నిర్వహిస్తున్న గన్నేరువరం మండల మైనార్టీ బీసీ గురుకుల పాఠశాల అద్దెభవనంలో నిర్వహిస్తున్నారు. విద్యా ర్థులకు దుప్పట్లు ఇవ్వక పోవడంతో ఇంటి నుంచి వాటిని తెచ్చుకొని చలి నుండి రక్షణ పొందుతున్నారు. భోజనం ముద్దగా అవుతుందని, విద్యార్థులు సరిగా తినడం లేక పోతున్నారు.. కొత్త బియ్యం కావడంతో మరో నెలరో జులపాటు ఇలానే ఉంటుందని అధికారులు చెబుతున్నారని నిర్వాహకులు తెలిపారు.
- కొత్తపల్లి మండలం చింతకుంట ఎస్సీ బాలికల గురుకుల పాఠశాల, కళాశాలలో 549 మంది విద్యార్థులున్నారు. భోజనంలో రాళ్లు వస్తున్నా యని, దుప్పట్లు ఇవ్వలేదని, చలి ఎక్కువగా ఉండటంతో ఇబ్బంది పడుతు న్నామని విద్యార్థులు వాపోతున్నారు. మానకొండూర్ మండలంలోని ఎంజేపీ బీసీ వెల్ఫేర్ బాలికల గురుకుల పాఠశాలను గుండ్లపల్లిలోని అద్దె భవనంలో నిర్వహిస్తుండగా డ్రైనేజీలు, స్నానపు గదులు కూడా సరిగా లేవు. కనీసం విద్యార్థులకు బెడ్స్ కూడా వేయకపోవడంతో నేలపైనే పడు కుంటున్నారని ఆవేదన చెందుతున్నారు. వేడి నీటిని స్నానాలకు ఇవ్వక పోవడంతో చన్నీటితో స్నానం చేస్తున్నామని, దీనితో జలుబు, జ్వరాలు వస్తున్నాయని విద్యార్థులు వాపోతున్నారు.

అన్ని గ్రామాలకు పోలీస్‌లను కేటాయించాలి

- పోలీస్ కమిషనర్ అభిషేక్ మొహంతి



పోలీస్ అధికారులతో మాట్లాడుతున్న సీపీ అభిషేక్ మొహంతి

జమ్మికుంట, డిసెంబర్ 03 (ఆంధ్రజ్యోతి): అన్ని గ్రామాలకు పోలీస్ అధికారులను కేటాయించాలని కరీంనగర్ పోలీస్ కమిషనర్ అభిషేక్ మొహంతి అన్నారు. మంగళవారం జమ్మికుంట పోలీస్ స్టేషన్‌ను ట్రైనీ ఐపీఎస్ వసుంధరతో కలిసి తనిఖీ చేశారు. స్టేషన్‌లో హాజరై ఉన్న సిబ్బందితో మాట్లాడి వారికి కేటాయించిన విధులు అడిగి తెలుసుకున్నారు. ఈ సందర్భంగా సిపి మాట్లాడుతూ సరైన పద్ధతిలో రికార్డుల నిర్వహణ, నమోదైన కేసుల వివరాలు సిసిటిఎస్‌లో పొందుపరుచాలన్నారు. పెండింగ్ కేసులు త్వరగా పూర్తి చేయాలని సూచించారు. సైబర్ నేరాలపై ప్రత్యేక దృష్టి పెట్టాలన్నారు. అన్ని రకాల విధులను సక్రమంగా నేర్చుకోవాలని, రికార్డు నిర్వాహణ, సీసీటీఎస్ రిసిప్షన్, కోర్టు డ్యూటీ, డ్రంక్ అండ్ డ్రైవ్ తనిఖీలు, బీట్, పెట్రోలింగ్, తదితర విధులను నూతనంగా విధుల్లో చేరిన కానిస్టేబుళ్లు సీని యర్లను అడిగి తెలుసుకోవాలన్నారు. కార్యక్రమంలో పట్టణ సీఐ వరంగంటి రవికుమార్, ఎస్ఐ ఆరో గ్యం, పోలీస్ సిబ్బంది పాల్గొన్నారు.

ఘనంగా 'ప్రజాపాలన' విజయోత్సవం

- స్టేడియం నుంచి సర్కస్ గ్రౌండ్ వరకు ర్యాలీ
- రూ.22.25 కోట్ల బ్యాంకు లింకేజీ చెక్కుల పంపిణీ
- కమిషనర్ చాహత్ బాజ్‌పాయి



ర్యాలీలో పాల్గొన్న కమిషనర్ చాహత్‌బాజ్‌పాయి, డిప్యూటీ కమిషనర్ స్వరూపరాణి

కరీంనగర్ టౌన్, డిసెంబరు 3 (ఆంధ్రజ్యోతి): నగరపాలక సంస్థ ఆధ్వర్యంలో ప్రజాపాలన విజయోత్సవాలను ఘనంగా నిర్వహించారు. రాష్ట్రంలో కాంగ్రెస్ ప్రభుత్వం ఏర్పడి ఏడాది అవుతున్న నేపథ్యంలో రాష్ట్రవ్యాప్తంగా ప్రజాపాలన విజయోత్సవాలను నిర్వహించాలని ప్రభుత్వం ఇచ్చిన పిలుపు మేరకు నగరపాలక సంస్థ కమిషనర్ చాహత్ బాజ్‌పాయి ఆధ్వర్యంలో విజయోత్సవాలను మంగళవారం నిర్వహించారు. ఉదయం డాక్టర్ బీఆర్ అంబేద్కర్ స్టేడియం వద్ద కమిషనర్ జెండా ఊపి ప్రజాపాలన విజయోత్సవ ర్యాలీని ప్రారంభించగా ర్యాలీ తెలంగాణ చౌక్ మీదుగా జ్యోతిబాపూలే గ్రౌండ్ వరకు కొనసాగింది. అనంతరం నగరపాలక సంస్థ పరిధిలోని స్వయం స్వశక్తి మహిళా సంఘాలు, పారిశుధ్య కార్మికులకు ప్రత్యేక వైద్యశిబిరాన్ని నగరపాలక సంస్థ కార్యాలయ ఆవరణలో ఏర్పాటు చేయగా కమిషనర్ శిబిరాన్ని ప్రారం భించారు. మెప్మా ఆధ్వర్యంలో ఇందిరా మహిళా శక్తి కార్యక్రమంలో నగరంలోని బస్టాండ్ వెనుక భాగంలో పలువురు కార్పొరేటర్లు, అధికారులతో కలిసి సమైక్య సంఘాల మహిళలతో ఏర్పాటు చేసిన పండ్లు నిలువ చేసే కోల్డ్ స్టోరేజీ సెంటర్‌ను ప్రారంభించారు. ఆ తర్వాత 33వ డివిజన్ భగత్‌నగర్ పెద్దమ్మ దేవాలయం వద్ద మహిళా సమాఖ్య సంఘాల సౌజన్యంతో ఏర్పాటు చేసిన కంప్యూటర్ ఎంబ్రాయిడరీ, బ్యూటీపార్లర్, కిరాణంషాపులను కమిషనర్ ప్రారంభించారు. మెప్మా ఆధ్వర్యంలో మహిళా సమాఖ్య సంఘాలు, స్ట్రీట్ వెండర్ గ్రూపులకు వివిధ బ్యాంకుల ద్వారా మంజూరైన 22.25 కోట్ల బ్యాంకు లింకేజీ రుణాల చెక్కులను కమిషనర్ పంపిణీ చేశారు.

ఉపాధి కూలీలకు 12వేలు ఇవ్వాలి

భగత్ నగర్, డిసెంబర్ 3 (ఆంధ్రజ్యోతి): ఉపాధిహామీ పనులు చేస్తున్న కూలీలకు 12వేల రూపాయలు అందిచాలని వ్యవసాయ కార్మిక సంఘం రాష్ట్ర కార్యదర్శి సృజన్‌కుమార్ అన్నారు. మంగళవారం నగరంలోని బద్దం ఎల్లారెడ్డి భవన్‌లో నిర్వహించిన కార్మిక సంఘం రాష్ట్ర కౌన్సిల్ సమావేశాలను జయప్రదం చేయాలని కోరుతూ సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఈ నెల 7,8 తేదీల్లో శంషాబాద్‌లో జరుగనున్న తెంగాణ వ్యవసాయ కార్మిక సంఘం రాష్ట్ర కౌన్సిల్ సమావేశాలను జయప్రదం చేయాలని ఆయన కోరారు. సమావేశంలో జిల్లా అధ్యక్షుడు బోయిని అశోక్, జిల్లా ఆఫీస్ బేరర్స్ దరపల్లి అంకూస్,న విలాసాగరం, అంజయ్య, ఎగుర్ల మల్లేశం, గట్టు రాజయ్య, తదితరులు పాల్గొన్నారు.

7న ఎస్‌యూలో మెగా జాబ్ మేళా

- శాతవాహన యూనివర్సిటీ వీసీ ఉమేష్ కుమార్

4లో

నేడు పెద్దపల్లిలో సీఎం సభ

- డిప్యూటీ సీఎం భట్టి, మంత్రుల రాక
- పలు అభివృద్ధి పనులకు శంకుస్థాపన

5లో

సీఎం కప్ క్రీడలను విజయవంతం చేయాలి



సమావేశంలో పాల్గొన్న డీఈవో జనార్దన్‌రావు, డీవైఎస్‌వో శ్రీనివాస్‌గౌడ్, డీపీవో రవీందర్

- జిల్లా నుంచి ఒక్కక్రీడాకారుడైనా ఒలంపిక్ స్థాయికి ఎదగాలి
- డీఈవో సీహెచ్ వి జనార్ధన్‌రావు

కరీంనగర్ స్పోర్ట్స్, డిసెంబరు 3 (ఆంధ్రజ్యోతి): సీఎం కప్ క్రీడలను విజయవంతం చేయాలని, పల్లె నుంచి ప్రపంచస్థాయికి అనే నినాదంతోనే ముఖ్యమంత్రి క్రీడలను ప్రారంభించారని జిల్లా విద్యాశాఖ అధికారి సీహెచ్‌వి జనార్ధన్‌రావు అన్నారు. మంగళవారం జిల్లా కేంద్రంలోని కలెక్టర్ కార్యాలయ ఆడిటోరియంలో జిల్లాలోని ఫిజికల్ డైరెక్టర్లు, వ్యాయామ ఉపాధ్యయులు, ఎంపీడీవోలతో సీఎం కప్ క్రీడలపై సమీక్ష నిర్వహించారు. ఈ సందర్భంగా డీఈవో మాట్లాడుతూ సీఎం కప్ పోటీల నిర్వహణలో వ్యాయామ ఉపాధ్యాయుల పాత్ర చాలా కీలకమైనదని అన్నారు. జిల్లా స్థాయికి ఎంపికయ్యేలా శిక్షణ అందించాలన్నారు. కేంద్ర ప్రభుత్వం భారతదేశంలో ఒలంపిక్ క్రీడల నిర్వహణకు కృషి చేస్తుందని జిల్లా నుంచి కనీసం ఒక క్రీడాకారుడైన ఒలంపిక్స్ స్థాయికి ఎదగాలని ఆశాభావం వ్యక్తం చేశారు. జిల్లా యువజన క్రీడాశాఖ అధికారి వి శ్రీనివాస్‌గౌడ్ మాట్లాడుతూ సీఎం కప్‌లో పాల్గొనేందుకు విద్యార్థులు, యువత ఎలా రిజిస్ట్రేషన్ చేసుకోవాలో వివరించారు. జిల్లా ఎస్‌జీఎఫ్ ప్రధాన కార్యదర్శి బి వేణుగోపాల్ మాట్లాడుతూ వ్యాయామ ఉపాధ్యాయులు రాష్ట్ర ప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా నిర్వహిస్తున్న సీఎం కప్ క్రీడల నిర్వహణ మన బాధ్యతగా గుర్తించాలన్నారు. కార్యక్రమంలో డీపీవో రవీందర్, బీసీ సంక్షేమశాఖ అధికారి అనిల్ కిరణ్, ప్లానింగ్ కో-ఆర్డినేటర్ మిల్కూరి శ్రీనివాస్, ప్రోగ్రామర్ శ్రీనివాస్, ఎంపీడీవోలు, ఎంపీపీ వోలు, జిల్లా వ్యాయామ ఉపాధ్యాయ సంఘాల అధ్యక్ష, కార్యదర్శులు అంతడ్పుల శ్రీనివాస్, ఎండీ యూనిస్ పాషా, సొల్లు సారయ్య, అంతటి శంకరయ్య, కళాశాలల ఎస్‌జీఎఫ్ కార్యదర్శి మధుజాన్సన్ పాల్గొన్నారు.

జిల్లా కళలకు పుట్టినిల్లు

- మేయర్ సునీల్‌రావు
- కళాభారతి పునఃప్రారంభం



కార్యక్రమాలను తిలకస్తున్న కలెక్టర్ పమేలా సత్పతి, అధికారులు

కరీంనగర్ కల్చరల్, డిసెంబరు 3 (ఆంధ్రజ్యోతి): కరీంనగర్ జిల్లా కవులు, కళా కారులకు పుట్టినిల్లని మేయర్ యాదగిరి సునీల్‌రావు అన్నారు. నగరపాలక సంస్థ ఆధ్వర్యంలో ఆధునీకరించిన జిల్లా కేంద్రంలోని కళాభారతిని మంగళవారం ఆయన మున్సిపల్ కమిషనర్ చాహత్ బాజ్‌పాయ్‌తో కలసి పునఃప్రారంభించారు. అనంతరం ఆయన మాట్లాడుతూ జిల్లా కలెక్టర్ చొరవతో, మున్సిపల్ కమిషనర్, అధికారుల సహకారంతో చాలా కాలంగా మూతపడి ఉన్న కళాభారతిని ఆధునీకరించి నగర ప్రజలకు అందుబాటులో ఉంచడం ఆనందంగా ఉందన్నారు. కళాభారతిలో కార్యక్రమాల నిర్వహణకు వీలుగా అన్ని సౌకర్యాలు కల్పించినట్లు తెలిపారు. ఈ సందర్భంగా కళాభారతిని విద్యుత్, దీపకాంతులతో, పుష్పాలతో అలంకరించారు.



నాటికను ప్రదర్శిస్తున్న కళాకారులు

కళాభారతిలో ఆకట్టుకున్న ప్రదర్శనలు

జిల్లా కేంద్రంలోని ఆధునీకరించిన కళాభారతిలో మంగళవారం రాత్రి ఏర్పాటు చేసిన సాంస్కృతిక ప్రదర్శనలు ఆకట్టుకున్నాయి. ముఖ్య అతిథిగా హాజరైన జిల్లా కలెక్టర్ పమేలా సత్పతి జ్యోతి ప్రకాశనం చేసి ప్రారంభించారు. బాలభవన్ చిన్నారులు, మహిళలు డప్పు కోలాట బృందాల ప్రదర్శనలతో పాటు మన సమైకృత కల్చరల్ అకాడమీ ఆధ్వర్యంలో సంస్థ అధ్యక్షుడు రొడ్డ యాదగిరి నేతృత్వంలో కళాంజలి హైదరాబాద్ వారి 50వ ప్రదర్శన అయిన రైతే రాజు' నాటిక ఆహుతులను ఆకట్టుకుంది. ఈ సందర్భంగా కళాభారతిని తిరిగి ప్రారంభించేందుకు కృషి చేసిన కలెక్టర్‌ను కళాకారులు సన్మానించారు. కార్యక్రమంలో అడిషనల్ కలెక్టర్ ప్రఫుల్ దేశాయ్, ట్రైనీ కలెక్టర్ అజయ్ యాదవ్, మున్సిపల్ కమిషనర్ చాహత్ బాజ్‌పాయ్, కళాకారులు జి కృపాదానం, సల్వాజీ ప్రవీణ్-సంధ్య, కాసు మహేందర్‌రాజు, కోడూరి పోచయ్య, వంగ సుధాకర్ తదితరులు పాల్గొన్నారు.

కరీంనగర్‌లో పునుగు పిల్లులు ప్రత్యక్షం

- పద్మనగర్‌లో ఒకటి, నగునూర్‌లో నాలుగు పునుగుపిల్లులు
- బంధించి జూకు తరలించిన అటవీశాఖ అధికారులు





ఇటీవల నగునూర్‌లో అటవీశాఖ అధికారులు పట్టుకున్న పునుగు పిల్లులు

కరీంనగర్ క్రైం, డిసెంబరు 3(ఆంధ్రజ్యోతి): తిరుపతి శేషాచలం అడవుల్లో కనిపించే అరుదైన జంతువు పునుగు పిల్లులు కరీంనగర్‌లో ప్రత్యక్షమయ్యాయి. నాలుగు రోజుల క్రితం కరీంనగర్ శివారులోని పద్మనగర్ ప్రాంతంలోని ఒక ప్రైవేట్ స్కూల్‌హాస్టల్ గదిలోకి ప్రవే శించిన ఒక పునుగుపిల్లి బీరువా పక్కన నక్కి ఉండటాన్ని విద్యార్థులు, సిబ్బంది గమనించి అటవీశాఖ అధికారులకు సమాచారం అందించారు. వెంటనే కరీంనగర్ అటవీశాఖ అధికారులు స్కూల్ వద్దకు చేరుకుని వలల సహాయంతో పునుగుపిల్లిని పట్టుకుని చొప్పదండి మండలం వెదురుగట్టు అటవీ ప్రాంతంలో వదిలి పెట్టారు. రెండు నెలల క్రితం కూడా కరీంనగర్ శివారులోని ప్రతిమ ఆసుపత్రి ఆవరణలో ఒక తల్లి పునుగు పిల్లితోపాటు నాలుగు పిల్లలను స్థానికులు గుర్తించారు. అటవీశాఖ అధికారులకు సమాచారం అందించగా అక్కడికి వెళ్లి అటవీశాఖ అధికారులు వలల సహాయంతో నాలుగు పునుగు పిల్లి పిల్లలను పట్టుకుని హైదరాబాద్‌లోని నెహ్రూ జులాజికల్ పార్క్‌కు తరలించారు. తల్లి పునుగు పిల్లి మాత్రం అక్కడి నుంచి తప్పించుకుంది. అక్కడి నుంచి తప్పించుకున్న పునుగు పిల్లి శనివారం పద్మనగర్ ప్రాంతంలోని ఓ స్కూల్ వద్ద పట్టుబడినట్లుగా అటవీశాఖ అధికారులు భావిస్తున్నారు. గతంలో ఎప్పుడూ ఈ ప్రాంతంలో కనిపించని పునుగుపిల్లులు కరీంనగర్ శివారులో కనిపించడంపై సర్వత్రా ఆసక్తి నెలకొంది. నల్లగా, గోధుమ రంగు చారలతో ఉండే ఈ పునుగు పిల్లులు అన్ని రకాల కీటకాలను ఆహారంగా తీసుకుంటా యని, పండ్లు, కూరగాయలు కూడా ఆహారంగా తీసుకుం టాయని కరీంనగర్ డిప్యూటీ రేంజ్ ఆఫీసర్ నర్సింహరావు తెలిపారు. ఇవి ప్రజలకు ఎలాంటి హాని తలపెట్టవన్నారు. జనావాసాల్లోకి జంతువులు వస్తే వెంటనే అటవీశాఖ లేదా పోలీసులకు సమాచారం అందిచాలని, వాటిని సురక్షితంగా బంధించి అటవీ ప్రాంతానికి తరలిస్తామన్నారు.

రోడ్డు ప్రమాదంలో యువకుడి దుర్మరణం

- మరొకరికి తీవ్రగాయాలు


సాగర్(ఫైల్)

కరీంనగర్ క్రైం, డిసెంబరు 3 (ఆంధ్రజ్యోతి): కరీంనగర్ రూరల్ మండలం మొగ్ధుంపూర్ వద్ద రాజీవ్ రహదారిపై మంగళవారం జరిగిన రోడ్డు ప్రమాదంలో మంచిర్యాల జిల్లా కోటపల్లి మండలం పారిపల్లి గ్రామానికి చెందిన బోగె సాగర్(20) అనే యువకుడు అక్కడికక్కడే మృతి చెందాడు. సాగర్ స్నేహితుడైన మంచిర్యాల జిల్లా దండేపల్లి మండలం కన్నపల్లికి చెందిన రాగుల శ్రీనివాస్‌కు తీవ్ర గాయాలయ్యాయి. కరీంనగర్ రూరల్ పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం సాగర్, శ్రీనివాస్ కలిసి మంచిర్యాల నుంచి కరీంనగర్ శివారులోని చల్మెడ ఆసుపత్రిలో చికిత్స పొందుతున్న బంధువులను చూసేందుకు మంగళవారం ఉదయం ద్విచక్రవాహనంపై బయలుదేరారు. మొగ్ధుంపూర్ ప్రభుత్వ స్కూల్ వద్దకు రాగానే ఇటుకబట్టీకి చెందిన ఒక లారీ రోడ్డు క్రాస్ చేస్తుండగా ద్విచక్ర వాహనాన్ని ఢీకొట్టింది. దీంతో బైక్ నడుపుతున్న సాగర్ తీవ్రగాయాలతో అక్కడిక్కడే మృతిచెందగా, శ్రీనివాస్‌కు తీవ్రగాయాలయ్యాయి. శ్రీనివాస్‌కు కరీంనగర్‌లో ప్రాథమిక చికిత్స అనంతరం మెరుగైన వైద్యం కోసం హైదరాబాద్‌కు తరలించారు. మృతుడు సాగర్ మంచిర్యాలలో ల్యాబ్ టెక్నీషియన్‌గా పనిచేస్తున్నాడు. మృతుడి కుటుంబసభ్యుల ఫిర్యాదుతో కేసు నమోదుచేసి దర్యాప్తు చేస్తున్నట్లు కరీంనగర్ రూరల్ పోలీసులు తెలిపారు.

విద్యుదాఘాతంతో ఒకరి మృతి

- మరొకరికి తీవ్ర గాయాలు


చంద్రమౌళి (ఫైల్)

భీమారం, డిసెంబరు 3 (ఆంధ్రజ్యోతి): మంచిర్యాల జిల్లాలోని భీమారం మండల కేంద్రంలోని ఐటీడీఏ కాలనీలో మంగళవారం ఉదయం విద్యుత్ షాక్‌తో పప్పు చంద్రమౌళి (53) మృతిచెందాడు. స్థానికులు పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం.. మానకొండూర్ మండలం వెల్ది గ్రామానికి చెందిన చంద్రమౌళి గత మూడు రోజుల క్రితం భీమారం మండల కేంద్రంలోని ఐటీడీఏ కాలనీలో నివాసం ఉంటున్న తన కూతురు ఇంటికి వచ్చాడు. మంగళవారం అల్లుడు రంజిత్ ఇంటి వద్ద కింద ఉన్న 20 ఫీట్ల ఇనుపరాడ్లను భవనంపైకి ఎక్కించేందుకు చంద్రమౌళి ఎదురింట్లో ఉన్న బాలుడు వంశీకృష్ణ సహాయం తీసుకున్నాడు. ఇద్దరు కలిసి ఇనుపరాడ్లను మెట్ల ద్వారా భవనంపైకి తీసుకువెళ్తుండగా పక్కనే ఉన్న 11కేవీ విద్యుత్ వైర్లకు ఇనుపరాడ్‌లు తగలడంతో విద్యుత్‌షాక్‌తో చంద్రమౌళికి తీవ్ర గాయాలు కాగా బాలుడు వంశీకృష్ణకు స్వల్ప గాయాలయ్యాయి. వెంటనే కుటుంబీకులు చంద్రమౌళిని మంచిర్యాలలోని ఆసుపత్రికి తరలిస్తుండగా మార్గమధ్యలో మృతిచెం దాడు. బాలుడు వంశీకృష్ణ చేతులు, పొట్టకు గాయాలు కాగా స్థానికంగా ప్రైవేటు ఆసుపత్రికి తరలించారు. అక్కడ నుంచి మెరుగైన వైద్యం కోసం మంచిర్యాలకు తరలించారు. మృతుని అల్లుడు రామటెంకి రంజిత్ ఇచ్చిన ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేస్తున్నట్లు భీమారం ఎస్ఐ శ్వేత తెలిపారు. మృత దేహాన్ని పోస్టుమార్టం నిమిత్తం మంచిర్యాల ఆసుపత్రికి తరలించినట్లు తెలిపారు. తన కూతురు, అల్లుడు, మనవరాలును చూడడానికి వెళ్లిన చంద్రమౌళి మృతిచెందడంతో కుటుంబీకులు, కాలనీవాసులు కన్నీరు మున్నీరుగా రోదించారు.

గంజాయి విక్రేతలపై కేసు నమోదు

జగిత్యాల క్రైం, డిసెంబరు 3 (ఆంధ్రజ్యోతి): గంజాయి విక్రయిస్తూ పోలీసుల కళ్లుగప్పి తిరుగుతున్న ముగ్గురు వ్యక్తులను మంగళవారం పట్టణ పోలీసులు పట్టుకుని కేసు నమోదు చేశారు. జగిత్యాల రూరల్ మండలం గుల్లపేటకు చెందిన రంజిత్, పట్టణంలోని సుతారి పేటకు చెందిన సాయి కిరణ్, సందీప్ అనే ముగ్గురు వ్యక్తులు రాజీవ్ చౌక్ ప్రాంతంలో ద్విచక్ర వాహనంపై అనుమానస్పదంగా తిరుగుతూ పోలీసులకు పట్టుబడ్డారు. వీరి వద్ద 204 గ్రాముల గంజాయిని పట్టుకుని సీజ్‌చేసి కేసు నమోదు చేసినట్లు ఎస్సై కిరణ్ కుమార్ పేర్కొన్నారు.

పండుటాకులకు అండగా..

> అందరూ ఉండి ఆదరణ కరువైన వారు కొందరు... ఎవరూ లేక నిరాశ్రయులైన వారు మరికొందరు.. అలాంటి వారిని అక్కున చేర్చుకుంటోంది వీర్లపల్లి గ్రామంలోని ఈశ్వర కృప వృద్ధాశ్రమం. సమాజంలో వృద్ధుల పట్ల జరుగుతున్న అమానవీయ సంఘటనలను చూసి చలించిపోయిన కొందరు సింగరేణి విశ్రాంత ఉద్యోగుల సంకల్పంతో ఈ ఆశ్రమం ఏర్పాటయ్యింది. కన్నబిడ్డల నిర్లక్ష్యానికి గురవుతున్న పండుటాకులను చేరదీసి క(చ)ంటిపాపలా చూసుకుంటోంది.

● నిస్సహాయ వృద్ధులను అక్కున చేర్చుకుంటున్న ఈశ్వర కృప వృద్ధాశ్రమం


వీర్లపల్లిలోని ఈశ్వర కృప వృద్ధాశ్రమం

కోల్‌సిటీటౌన్, డిసెంబరు 3 (ఆంధ్రజ్యోతి): గోదావరిఖనికి చెందిన కొందరు సింగరేణి రిటైర్డ్ ఉద్యోగులు కళ్లముందు వృద్ధులకు జరుగుతున్న అన్యాయాలను చూసి చలించిపోయారు. నిస్సహాయ స్థితిలో బాధపడుతున్న వృద్ధుల కోసం అన్ని వసతులతో కూడిన ఓ ఆశ్రమాన్ని ఏర్పాటు చేయాలని నిర్ణయించుకున్నారు. ఆ క్రమంలో వారంతా సీనియర్ సిటిజన్ సోషల్ సర్వీస్ ఆర్గనైజేషన్‌గా ఏర్పడ్డారు. వారి ఆశయానికి వీర్లపల్లికి చెందిన సీతారాంరెడ్డి తోడయ్యారు. తన సొంత స్థలంలో అన్ని వసతులతో కూడిన వృద్ధాశ్రమాన్ని నిర్మించి ఇవ్వడంతో ఈశ్వర కృప వృద్ధాశ్రమం ఏర్పాటైంది. ఏడాదిన్నర కాలంగా కొనసాగుతున్న ఈ ఆశ్రమంలో వివిధ ప్రాంతాలకు చెందిన 26 మంది ఉన్నారు. రిటైర్డ్ ఉద్యోగుల సొంత ఖర్చులతో మొదలైన ఆశ్రమ నిర్వహణ ప్రస్తుతం పలువురు దాతల సహకారంతో కొనసాగుతున్నది. ఆశ్రమంలోని వారికి పౌష్టికాహారం ఇవ్వడంతో పాటు వారానికి రెండుసార్లు వైద్యపరీక్షలు చేయిస్తున్నారు. దీర్ఘకాలిక వ్యాధులతో బాధపడుతున్న వారికి ప్రత్యేక సేవలందిస్తున్నారు. గీతా పారాయణం, టీవీ చూడటం, పత్రికలు చదవడం, యోగాలాంటి వ్యాపకాలతో వారిలో మానసికోల్లాసాన్ని నింపుతున్నారు.


ఆశ్రమంలో కూర్చొని మాట్లాడుకుంటున్న వృద్ధులు


ఆశ్రమంలో అన్నం తింటున్న వృద్ధులు

● అందరూ ఉన్నా.. అనాథను..



అయినవాళ్లందరు ఉన్నా.. అనాథగా ఉన్నాను. నా భర్త మరణించిన తరువాత నిస్సహాయ పరిస్థితుల్లో ఆశ్రమం అక్కున చేర్చుకుంది. ప్రస్తుతం ఆశ్రమంలో అన్ని వసతులతో ఆనందంగా ఉన్నాను.

- రాజేశ్వరి, పెద్దపల్లి

● నా అనేవాళ్లు లేరు..



నా భర్త 16 ఏళ్లక్రితం చనిపోయాడు. పిల్లలు లేరు. ఒంటరిగా ఉంటూ కూలిపనికి పోయేదాన్ని. వృద్ధాప్యం మీద పడడంతో ప్రస్తుతం కూలిపని చేసే పరిస్థితి లేదు. ఆశ్రమం అన్నం పెట్టి ఆదరిస్తోంది.

- భూదేవి, పెద్దపల్లి

● వృద్ధులకు ఆశ్రమం నిర్మించాలనే సంకల్పంతో..



వృద్ధుల కోసం ఆశ్రమం నిర్మించాలన్న సంకల్పంతో రిటైర్డ్ ఉద్యోగులం సీనియర్ సిటిజన్ సర్వీస్ ఆర్గనైజేషన్ ఏర్పాటు చేశాం. దాని ఆధ్వర్యంలో సభ్యుల నుంచి నిధులు సేకరించాం. ఆశ్రమం కోసం ప్రయత్నాలు చేస్తుండగా వీర్లపల్లిలో సీతారాంరెడ్డి తన సొంత స్థలంలో ఆశ్రమానికి అవసరమైన గదులు నిర్మించి ఇచ్చారు. గత ఏడాది మార్చి 24న ఈశ్వర కృప ఆశ్రమం ఏర్పాటైంది. అప్పటి నుంచి వృద్ధులతో పాటు అనారోగ్యంతో బాధపడే వారికి సేవలందిస్తున్నాం.

- పీటీస్వామి, అధ్యక్షుడు, సీనియర్ సిటిజన్ సర్వీస్ ఆర్గనైజేషన్

కొండచిలువ పట్టివేత

కరీంనగర్ క్రైం, డిసెంబరు 3 (ఆంధ్రజ్యోతి): కరీంనగర్ శివారులోని శాతవాహన విశ్వ విద్యాలయం ఆవరణలో మంగళవారం కొండ చిలువను కరీంనగర్ అటవీశాఖ అధికారులు పట్టుకున్నారు. ఎస్‌యూ ఆవరణలోని క్రీడా మైదానంలో ఉదయం క్రికెట్ నెట్‌లో చిక్కుకున్న కొండ చిలువను వాకర్స్ గమనించి అటవీశాఖ అధికారులకు సమాచారం అందించారు. వెంటనే కరీంనగర్ ఫారెస్ట్ రేంజి ఆఫీసర్ షౌకత్ హుస్సేన్, డిప్యూటీ రేంజ్ ఆఫీసర్ నర్సింగారావు, సిబ్బందితో హుటాహుటిన అక్కడికి వెళ్లి స్నేక్ క్యాచర్ సన సహకారంతో నెట్‌లో చిక్కుకున్న కొండ చిలువను రక్షించారు. అనంతరం కొండ చిలువను అటవీ ప్రాంతంలో సురక్షితంగా వదిలిపెట్టారు.

ద్విచక్ర వాహనాన్ని ఢీకొన్న కారు..

ముగ్గురికి తీవ్ర గాయాలు

చందుర్తి డిసెంబరు 3 (ఆంధ్రజ్యోతి): చందుర్తి మండలం బండపల్లిలో మంగళవారం రాత్రి రోడ్డు పక్కన నిలిపి ఉన్న ద్విచక్ర వాహనాన్ని గుర్తుతెలియని కారు ఢీ కొట్టి వెళ్లడంతో ముగ్గురికి తీవ్రగాయాలయ్యాయి. వీర్నపల్లి మండలం గర్జనపల్లికి చెందిన మాజీ ఉపసర్పంచ్ దర్శనాల రామస్వామి తోపాటు భూక్య ప్రవీణ్, అజ్మీర తిరుపతి వేములవాడకు నుంచి బండపల్లి మీదుగా గర్జనపల్లికి వెళ్తున్నారు. బండపల్లిలో రోడ్డు పక్కన బైకును నిలిపి మాట్లాడుతున్నారు. ఈ క్రమంలో బావుసాయిపేట నుంచి వేములవాడ వెళ్తున్న గుర్తుతెలియని కారు వారిని ఢీకొట్టింది. ఈ ప్రమాదంలో రామస్వామి, ప్రవీణ్, తిరుపతి గాయపడ్డారు. స్థానికులు క్షతగాత్రులను సిరిసిల్ల ఏరియా ఆసుపత్రికి తరలించారు.

ఉద్యోగాలు ఇప్పిస్తానని మోసం..

ఇద్దరి రిమాండ్

వేములవాడరూరల్, డిసెంబరు 3 (ఆంధ్రజ్యోతి): ఉద్యోగాలు ఇప్పిస్తానని మోసం చేసిన ఇద్దరిని రిమాండ్‌కు తరలించినట్లు వేమువాడ రూరల్ సీఐ శ్రీనివాస్ మంగళవారం తెలిపారు. గంగాధర మండలం ఉప్పర మల్యాలకు చెందిన బందరకంటి తిరుపతి, మంచిర్యాలలోని వికాస్‌నగర్‌కు చెందిన గుమ్మా జగన్నాథరావు వేములవాడ రూరల్ మండలం చెక్కపల్లికి చెందిన ఎడపల్లి స్వామికి ఉద్యోగం ఇప్పిస్తామని నమ్మించారు. అతడి వద్ద 7,80,000 రూపాయలు తీసుకున్నారు. ఉద్యోగం ఇప్పించకుండా మోసం చేశారు. ఈ సంఘటనలో ఇద్దరిని రిమాండ్‌కి తరలించామని, హైదరాబాద్‌కు చెందిన పవన్‌రాజ్ పరారీలో ఉన్నాడని సీఐ తెలిపారు.

ఆస్తి కోసం అన్నను చంపిన తమ్ముడు


మృతుడి దేహాన్ని పరిశీలిస్తున్న డాగ్ స్క్వాడ్

వెల్గటూర్, డిసెంబరు 3 (ఆంధ్రజ్యోతి): జగిత్యాల జిల్లా వెల్గటూర్ మండలం కుమ్మరిపల్లి గ్రామంలో ఆస్తి కోసం రక్తం పంచుకు పుట్టిన అన్నను చంపిన సంఘటన కలకలం రేపింది. పోలీసుల కథనం ప్రకారం కుమ్మరిపల్లి గ్రామానికి చెందిన బొమ్మెల భారతమ్మ శంకరయ్య దంపతులకు ఇద్దరు కుమారులు సుమన్(34), డిల్లేష్ ఉన్నారు. సుమన్ కూలి పని చేసుకుంటూ జీవిస్తున్నాడు. కుమ్మరిపల్లి గ్రామంలో తల్లికి వారసత్వంగా వచ్చిన సుమారు 32 గుంటల భూమి ఉంది. రెండు నెలల క్రితం ఆ భూమిని అమ్మకానికి పెట్టగా కొనుగోలుదారుడు బయానగా 2,60,000 రూపాయలు ఇచ్చాడు. బయానా డబ్బులు డిల్లేష్ ఒక్కడే వాడుకున్నాడు. ఆ డబ్బుల్లో తన వాటా తనకు ఇవ్వాలని అన్న సుమన్ తమ్ముడు డిల్లేష్‌ను అడిగాడు. ఈ విషయంపై తరచూ అన్నదమ్ముల మధ్య గొడవ జరుగుతోంది. 20 రోజుల క్రితం డిల్లేష్, అతని స్నేహితుడు సురేందర్ ఇద్దరు కలిసి సుమన్‌పై దాడి చేశారు. అప్పటి నుంచి అన్న సుమన్‌ను చంపితే ఆస్తి మొత్తం తనకే చెందుతుందని డిల్లేష్ భావించాడు. సోమవారం రాత్రి సుమన్ కిరాణం షాపునకు వెళ్లడం గమనించిన డిల్లేష్, అతని స్నేహితుడు సురేందర్ సహాయంతో దాడిచేసి కత్తితో దాడి చేసి హతమార్చాడు. హత్య అనంతరం ఇద్దరూ గుట్టుచప్పుడు కాకుండా ఎవరి ఇళ్లకు వారు వెళ్లిపోయారు.

షాపునకు వెళ్లిన సుమన్ ఎంతకీ ఇంటికీ రాక పోవడంతో తల్లి భారతమ్మ ఫోన్ చేసింది. ఫోన్ ఎంతకీ లేపకపోవడంతో గాలిస్తుండగా కిరాణం షాపు సమీపంలో సుమన్ మృతదేహాన్ని గుర్తించారు. సమాచారం అందుకున్న పోలీసులు డాగ్ స్క్వాడ్ సహాయంతో విచారణ చేపట్టారు. డాగ్ స్క్వాడ్ మృతుడి సోదరుడు డిల్లేష్ ఇంటికి వెళ్లడంతో పోలీసులు అతనిని అదుపులోకి తీసుకుని విచారించారు. డిల్లేష్ నేరం అంగీకరించాడని సీఐ రాంనర్సింహారెడ్డి తెలిపారు. మృతుడు సుమన్ భార్య లావణ్య ఫిర్యాదు మేరకు కేసు దర్యాప్తు చేస్తున్నామని పోలీసులు వివరించారు.

7న ఎస్‌యూలో మెగా జాబ్ మేళా

- శాతవాహన యూనివర్సిటీ వీసీ ఉమేష్ కుమార్



మాట్లాడుతున్న వీసీ ఉమేష్‌కుమార్

గణేశ్‌నగర్, డిసెంబరు 3 (ఆంధ్రజ్యోతి): శాతవాహన విశ్వవిద్యాలయం పరిధిలో ఈనెల 7న హెచ్‌ఆర్ కంపెనీ ఆధ్వర్యంలో మెగా జాబ్ మేళా నిర్వహిస్తున్నట్లు ఎస్‌యూ వైస్ చాన్స్‌లర్ ఉమేష్ కుమార్ తెలిపారు. యూనివర్సిటీలో మంగళవారం విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడారు. 50 కంపెనీలతో ఐదు వేల ఖాళీల భర్తీకి మెగా జాబ్ మేళా నిర్వహిస్తున్నట్లు తెలిపారు. జాబ్ మేళా ఉదయం తొమ్మిది గంటల నుంచి ప్రారంభం అవుతుందన్నారు. ఐటీ, ఫార్మా, నర్సింగ్, హాస్పిటాలిటీ, బ్యాంకింగ్, రిటైల్, మేనేజ్‌మేంట్ తదితర సెక్టార్లలో ఉద్యోగావకాశాలు కల్పిస్తున్నట్లు తెలిపారు. ఈ మెగా జాబ్ మేళాలో ఉమ్మడి జిల్లాలోని అన్ని డిగ్రీ, పీజీ కళాశాలల విద్యార్థులు పాల్గొనవచ్చన్నారు. బీటెక్, ఎంటెక్, ఆల్ గ్రాడ్యుయేట్స్, పీజీ, ఫార్మా, నర్సింగ్‌కు సంబంధించిన విద్యార్థులు అర్హులని పేర్కొన్నారు. ఈ అవకాశాన్ని 2020-2025 వరకు చదివిన విద్యార్థులు సద్వినియోగం చేసుకోవాలని సూచించారు. వివరాలకు 8121212873, 7337373575 నంబర్లలో సంప్రదించాలని వీసీ అన్నారు. అనంతరం జాబ్ మేళా పోస్టర్ ఆవిష్కరించారు. కార్యక్రమంలో రిజిస్ట్రార్ వరప్రసాద్, ప్రొఫెసర్ మనోహర్, హెచ్‌ఆర్ కంపెనీ నిర్వాహకులు తాళ్లపెల్లి అశోక్ పాల్గొన్నారు.

నేడు స్కిల్ డెవలప్‌మెంట్ సెంటర్ ప్రారంభం

శాతవాహన యూనివర్సిటీలో విద్యార్థుల కోసం బుధవారం ఉదయం 10:30 గంటలకు స్కిల్ డెవలప్‌మెంట్ సెంటర్‌ను ప్రారంభిస్తున్నటు వీసీ ఉమేష్ కుమార్ తెలిపారు. విద్యార్థులకు స్కిల్ డెవలప్‌మెంట్‌లో ఇంగ్లీష్‌పై నైపుణ్యం పెంచేందుకు మూడు నెలల ప్రత్యేక కార్యక్రమాన్ని చేపడుతున్నట్లు వీసీ తెలిపారు.

భూసేకరణ గ్రామసభను బహిష్కరించిన రైతులు

భీమారం, డిసెంబరు 3 (ఆంధ్రజ్యోతి): జగిత్యాల జిల్లా కలికోట సూరమ్మ చెరువు కుడి కాలువ నిర్మాణం చేయడానికి భూసేకరణ కోసం ఏర్పాటు చేసిన గ్రామసభను గోవిందారం రెవెన్యూ పరిధిలోని గోవిందారం, దేశాయిపేట, రాజ లింగంపేట రైతులు మంగళవారం బహిష్కరించారు. సంబంధిత రైతులతో తహసీల్దార్ రవికుమార్ మంగళవారం మధ్యాహ్నం భీమారం మండలంలో గ్రామసభ ఏర్పాటు చేశారు. భూ నిర్వాసిత బాధితులందరు కలిసి భూసేకరణ నిలుపు దల చేసి తమకు న్యాయం చేయాలని ఏకగ్రీవ తీర్మానం చేశారు. భూసేకరణలో సన్న, చిన్నకారు రైతులము ఉన్నామని, తమ కుటుంబాలకు ఈ భూములే ఆధారమని అధికారులతో వారు పేర్కొన్నారు. ఈ భూమిని ఇవ్వడానికి తాము సిద్ధంగా లేమన్నారు. అనంతరం తహసీల్దార్‌కు భూసేకరణ నిలుపుదల చేస్తూ ప్రాథమిక నోటిఫికేషన్‌ను రద్దు చేయాలని రైతులు వినతి పత్రం సమర్పించారు.

థాయిలాండ్‌లో తప్పిపోయిన ఇద్దరు తెలంగాణవాసులు


ప్రవాసీ ప్రజావాణిలో ఫిర్యాదు చేస్తున్న అరవింద్, సాగర్ భార్యలు

జగిత్యాల, డిసెంబరు 3 (ఆంధ్రజ్యోతి): ఏజెంట్‌కు రెండు లక్షల రూపాయల చొప్పున చెల్లించి విజిట్ వీసాపై థాయిలాండ్‌కు వెళ్లిన ఇద్దరు తెలంగాణవాసులు కొన్ని రోజులుగా అక్కడ కనిపించడం లేదు. నిజామాబాద్ జిల్లా శెట్టిపల్లికి చెందిన శనిగారపు అరవింద్, జగిత్యా ల జిల్లా ఆత్మకూరుకు చెందిన కొండ సాగర్ గత నెల 11న ముంబాయి నుంచి థాయిలాండ్ రాజధాని బ్యాంకాక్‌కు వెళ్లారు. ఆ తర్వాత 21 నుంచి వారు అందుబాటులో లేకుండాపోయారని, ఫోన్ చేస్తే కలువడం లేదని అరవింద్ భార్య జల, సాగర్ భార్య కాశమ్మ మంగళవారం హైదరాబాద్‌లోని ప్రవాసీ ప్రజావాణిలో ఫిర్యాదు చేశారు. వారి వెంట కాంగ్రెస్ ఎన్‌ఆర్‌ఐ సెల్ నాయకుడు వినోద్‌కుమార్, మంద భీంరెడ్డి ఉన్నారు. కాగా తప్పిపోయిన ఇద్దరి ఆచూకీ తెలుసుకుని ఏజెంట్‌పై పోలీస్ కేసు నమోదు చేయాలని వారు ముఖ్యమంత్రికి విజ్ఞప్తి చేశారు.

జీడీకే 7ఎల్ఈపీలో హెడ్ ఓర్‌మ్యాన్ మృతి


సత్యనారాయణ(ఫైల్)

యైటింక్లయిన్‌కాలనీ, డిసెంబరు 3 (ఆంధ్రజ్యోతి): పెద్దపల్లి జిల్లా రామగుండం ఏరియా-2 పరిధి జీడీకే 7ఎల్ఈపీ గనిలో మంగళవారం ప్రమాద వశాత్తు హెడ్ ఓర్‌మ్యాన్ తీట్ల సత్యనారాయణ(45) మృతిచెందాడు. మూతపడిన 7ఎల్ఈపీ గనిలో ఇసుక నింపే పనులు జరుగుతున్నాయి. మంగళవారం మొదటి షిఫ్టు విధులకు వచ్చిన సత్యనారాయణ మరో జనరల్ మజ్దూర్‌తో కలిసి ఇసుక నింపే పనులను పర్యవేక్షిస్తున్న క్రమంలో మధ్యాహ్నం రెండున్నర గంటల ప్రాంతంలో ప్రమాదవశాత్తు ఇసుకలో కూరుకుపోయాడు. జనరల్ మజ్దూర్ ఇచ్చిన సమాచారంతో రెస్క్యూ సిబ్బంది రెండు గంటల పాటు శ్రమించి సత్యనారాయణ మృతదేహాన్ని వెలికితీశారు. రామగుండం ఎమ్మెల్యే మక్కాన్‌సింగ్ గనికి చేరుకుని ప్రమాద వివరాలను తెలుసుకున్నారు. ప్రమాదంపై ఉన్నతాధికారులు విచారణ జరిపించి, బాధ్యులపై చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేశారు. సత్యనారాయణ స్వగ్రామం జిల్లాలోని పాలకుర్తి మండలం బసంత్‌నగర్. సత్యనారాయణకు భార్య, కుమారుడు, కుమార్తె ఉన్నారు.


మృతదేహం వెలికితీసే పనుల్లో రెస్క్యూ టీం

అంగవైకల్యం ఉన్నా..

ఆత్మవిశ్వాసంతో ముందుకు

● కాళ్లు చచ్చుబడినా నాలుగు పట్టాలు

● బండలింగంపల్లి యువకుడు వెంకటేష్ ప్రతిభ

ఎల్లారెడ్డిపేట, డిసెంబరు 3 (ఆంధ్రజ్యోతి) : అంగవైకల్యం ఉన్నా ఆ యువకుడు ఏనాడూ బాధపడలేదు. నడవలేకపోయినా చేతులతో పాఠశాల వరకు వెళ్లి పాఠాలు నేర్చుకున్నాడు. అతడి ఆత్మవిశ్వాసం ముందు అంగవైకల్యం మోకరిల్లింది. చదువులో నాలుగు పట్టాలు పొంది అందరి చేత శభాష్ అనిపించుకున్నాడు. ఎల్లారెడ్డిపేట మండలం బండలింగంపల్లి గ్రామానికి చెందిన దివ్యాంగ యువకుడు కుంట వెంకటేశ్ చిన్ననాటి నుంచి చదువంటే ప్రాణం. మూడేళ్ల ప్రాయం లోనే పోలియో బారిన పడడంతో రెండు కాళ్లు చచ్చుబడిపోయాయి. అమ్మనాన్నలు పడుతున్న కష్టాన్ని చూడలేని వెంకటేశ్ చదువుకోవాలని భావించాడు. శరీరం సహకరించకపోయినా స్థానిక ప్రభుత్వ ప్రాథమిక పాఠశాలలో ఐదో తరగతి, ఉన్నత పాఠశాలలో పదో తరగతి పూర్తి చేశాడు. చిన్నతనంలో తల్లిదండ్రులు భూదవ్వ-నాంపల్లి వెంకటేశ్‌కు పాఠశాల వరకు తీసుకెళ్లేవారు. చేతిలో డబ్బులు లేకపోయినా తల్లిదండ్రులు కూలీ పనులు చేయగా వచ్చిన డబ్బుల్లో కొంత పుస్తకాలు, నోటు పుస్తకాలకు వెచ్చించేవారు. 2007-2009 వరకు మండలంలోని గొల్లపల్లిలో ఓ ప్రైవేటు జూనియర్ కళాశాలలో ఇంటర్ చదివాడు. కరీంనగర్‌లో డీఎడ్, అనంతరం అంబేద్కర్ విశ్వవిద్యాలయంలో దూర విద్య ద్వారా డిగ్రీ చదివాడు. హైదరాబాద్‌లోని ఉస్మానియా విశ్వవిద్యాలయంలో బీఎడ్, ఎంఎడ్ చేయడంతోపాటు దూర విద్యలో ఎంఏ తెలుగు పూర్తి చేశాడు. ప్రస్తుతం ఎంఏలో సైకాలజీ చదువుతున్నాడు.


ప్రాక్టికల్‌లో భాగంగా వీల్‌చైర్‌లో పాఠాలను బోధిస్తున్న వెంకటేశ్

ప్రభుత్వ కొలువులకు దరఖాస్తు చేసుకున్నా కొద్ది పాటి వ్యత్యాసంతో ఉద్యోగం సాధించలేకపోయాడు. అయినా పట్టువదలని విక్రమార్కుడిలా చదువుతూనే ముందుకు సాగుతున్నాడు.


చదువుకుంటున్న వెంకటేశ్

చిన్నప్పటి నుంచి చదువంటే ఇష్టం

మాది నిరుపేద కుటుంబం. చిన్నతనం నుంచి చదువంటే ఇష్టం. అమ్మానాన్నలు పడుతున్న కషం చూడలేకపోయాను. ఉన్నత చదు వులు చదివి ప్రభుత్వ ఉద్యోగంలో స్థిరపడాలని నిర్ణయించుకున్నా. చిన్నతనంలో అమ్మానాన్నలు పాఠశాలకు తీసుకెళ్లి తీసుకొచ్చేవారు. ఉన్నత విద్యాభ్యాసంలో మిత్రలు సహకరించారు. చదువుకు అవస రమైన పుస్తకాలు సమకూర్చేవారు. ఉపాధ్యాయ కొలువు కొట్టాలనేది నా లక్ష్యం.

- కుంట వెంకటేశ్, యువకుడు

నేడు పెద్దపల్లిలో సీఎం సభ

● హాజరుకానున్న డిప్యూటీ సీఎం భట్టి, మంత్రులు ● పలు అభివృద్ధి పనులకు శంకుస్థాపన

పెద్దపల్లి, డిసెంబరు 3 (ఆంధ్రజ్యోతి): బుధవారం పెద్దపల్లిలో నిర్వహించనున్న యువ వికాసం బహిరంగ సభకు సీఎం ఎనుముల రేవంత్‌రెడ్డి, మంత్రులు హైదరాబాద్ హెలీకాప్టర్‌లో సాయంత్రం 4 గంటలకు సభాస్థలికి చేరుకోనున్నారు. అక్కడ వివిధ అభివృద్ధి పనులకు శంకుస్థాపన చేసి వివిధ శాఖల ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన స్టాళ్లను తిలకించనున్నారు. 4:30 గంటలకు జ్యోతిప్రజ్వలన చేసి తెలంగాణ రాష్ట్ర గీతంతో సభ ఆరంభించనున్నారు, 4:35 నుంచి 4:55 గంటల వరకు వివిధ శాఖల మంత్రులు ప్రసంగించనున్నారు. ఆ తర్వాత 9007 మంది గ్రుప్ 4, సింగరేణిలో ఉద్యోగాలు సాధించిన వారిలో 10 మంది నియామక పత్రాలను అందజేయనున్నారు. స్కిల్ యూనివర్శిటీకి సంబంధించి 7 ఏజెన్సీలతో ఒప్పందం కుదుర్చుకోనున్నారు. సీఎం కప్ పోటీల కప్ ఆవిష్కరించనున్నారు. 5:10 నుంచి 5:20 వరకు ఉప ముఖ్యమంత్రి మల్లు భట్టి విక్రమార్క ప్రసంగించనున్నారు. అనంతరం 5:20 నుంచి 5:50 గంటల వరకు అరగంట సేపు ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి ప్రసంగించనున్నారు. తిరిగి హైదరాబాద్‌కు వెళ్లనున్నారు. ఏర్పాట్లను రాష్ట్ర ఐటీ, పరిశ్రమల శాఖ మంత్రి దుద్దిళ్ల శ్రీధర్ బాబు, ప్రభుత్వ సలహాదారు హర్కార వేణుగోపాల్ రావు, పెద్దపల్లి ఎమ్మెల్యే చింతకుంట విజయ రమణారావు, అధికారులు పరిశీలించారు.



సభ ఏర్పాట్లను పరిశీలిస్తున్న ఐజీ చంద్రశేఖర్‌రెడ్డి, సీపీ ఎం శ్రీనివాస్

కాంగ్రెస్ ఏడాది పాలనలో ఎన్నో అభివృద్ధి పనులు చేసి సంక్షేమ పథకాలను అమలు చేశామని రాష్ట్ర ఐటీ, పరిశ్రమల శాఖ మంత్రి దుద్దిళ్ల శ్రీధర్‌బాబు అన్నారు. మం గళవారం పెద్దపల్లి ఎమ్మెల్యే క్యాంపు కార్యాలయంలో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో మాట్లాడారు. జిల్లాలోని మూడు నియోజకవర్గాల్లో వివిధ అభివృద్ధి పనులకు ముఖ్యమంత్రి శంకుస్థాపన చేయనున్నారని పేర్కొన్నారు.

ట్రాఫిక్ మళ్లింపు ఇలా..

పెద్దపల్లిటౌన్, (ఆంధ్రజ్యోతి): ముఖ్యమంత్రి పర్యటన సందర్భంగా సామాన్య ప్రజలకు ఎలాంటి ట్రాఫిక్ సమస్య కలగకూడదని ప్రజల సౌకర్యార్థం ముందస్తుగా ట్రాఫిక్ డైవర్షన్స్ గురించి పోలీస్ అధికారులు సూచనలు జారీ చేశారు. బుధవారం ఉదయం నుంచి ట్రాఫిక్ డైవర్షన్స్ అమల్లో ఉంటాయని, ప్రజలందరూ సహకరించ గలరని విజ్ఞప్తి చేశారు. ఉదయం 10 గంటల నుంచి ముఖ్యమంత్రి పర్యటన ముగిసే వరకు ప్రజలు ఇతర ప్రత్యామ్నాయ రవాణా మార్గాలు చూసుకో వాలని పోలీస్ వారి సూచనలు జారీ చేశారు.

రామగుండం నుంచి కరీంనగర్ వైపు వెళ్లే అన్ని వాహనాలు ధర్మారం ఎక్స్‌రోడ్(బసంత్‌నగర్) ద్వారా కుక్కల గూడూరు, రాజారాంపల్లి, ధర్మా రం, చొప్పదండి ద్వారా కరీంనగర్ వైపు వెళ్లాలని, మంథని వైపు నుంచి కరీంనగర్ వైపు వెళ్లే భారీ వాహనాలు అప్పన్నపేట, ధర్మారం ఎక్స్‌రోడ్ (బసంత్‌నగర్) ద్వారా కుక్కలగూడూరు, రాజారాంపల్లి, ధర్మారం, చొప్ప దండి ద్వారా కరీంనగర్ వైపు వెళ్లాలని, మంథని వైపు నుంచి కరీంనగర్ వైపు వెళ్లే 4 వీలర్లు అప్పన్నపేట నుంచి ఎడమ వైపు తీసుకుని బొంపల్లి, దొంగతుర్తి, ధర్మారం, చొప్పదండి ద్వారా కరీంనగర్ వైపు వెళ్లాలని, కరీం నగర్ నుంచి రామగుండం, మంథనివైపు వెళ్లే భారీ వాహనాలు ముగ్దుంపూర్ ఎక్స్ రోడ్ నుంచి కరీంనగర్-లక్సెట్టిపేట రోడ్ ద్వారా చొప్ప దండి, ధర్మారం, రాజారాంపల్లి వద్ద కుడి వైపు తీసుకుని కుక్కలగూడూర్, ధర్మారం ఎక్స్‌రోడ్ ద్వారా రాజీవ్ రహ దారి (కరీంనగర్- రామగుండం)కు చేరుకుని రామగుండం, మంథనివైపు వెళ్లాలని, కరీంనగర్ నుంచి పెద్ద పల్లి, రామగుండం వైపు వచ్చే 4వీలర్‌లు సుల్తానాబాద్ మండలం నారా యణపూర్ ఎక్స్‌రోడ్ నుంచి నారాయణపూర్, కొదురుపాక, నిమ్మ నపల్లి, పెద్దపల్లి సాగర్‌రోడ్, జూనియర్ కాలేజ్‌రోడ్(ఎంబీ గార్డెన్‌రోడ్), అయ్యప్ప జంక్షన్ ద్వారా రామగుండం, మంథనివైపు వెళ్లాలని సూచించారు.

సీఎం పర్యటన సందర్భంగా ఎవరైనా శాంతిభద్రతలకు విఘాతం కలి గించే విధంగా కార్యక్రమాలు చేసినా వారిపై చట్టప్రకారం చర్యలు తీసు కుంటామని రామగుండం పోలీస్ కమిషనర్ ఎం.శ్రీనివాస్, ఐజీ హెచ్చ రించారు. చట్టవ్యతిరేక, ప్రజా శాంతికి, శాంతి భద్రతలకు విఘాతం కలిగించే వారు ఎంతటి వారైనా ఉపేక్షించేది లేదన్నారు. ఎలాంటి సంఘ టనలకు తావులేకుండా ప్రశాంత వాతావరణం ఉండాలని అన్ని వర్గాల ప్రజలు శాంతిభద్రతల సమస్య తలెత్తకుండా పోలీసులతో సహకరిం చాలని సీపీ కోరారు. ఈ కార్యక్రమంలో పెద్దపల్లి డీసీపీ చేతన, రాజన్న సిరిసిల్ల ఎస్పీ అఖిల్ మహజన్ మెదక్ ఎస్పీ ఉదయ్ కుమార్‌రెడ్డి, మంచిర్యాల డీసీపీ భాస్కర్, కొమరంభీమ్ ఆసిఫాబాద్ ఎస్పీ శ్రీనివాస్, ఇతర పోలీస్ అధికారులు పాల్గొన్నారు.

సీఎం పర్యటనకు పటిష్ట బందోబస్తు

రామగుండం సీపీ ఎం శ్రీనివాస్

పెద్దపల్లిటౌన్, డిసెంబరు 3 (ఆంధ్రజ్యోతి) : పెద్దపల్లి జిల్లా కేంద్రంలో బుధవారం ముఖ్యమంత్రి పర్యటన సందర్భంగా పోలీస్ శాఖ పటిష్ట బందోబస్తు ఏర్పాటు చేసినట్లు రామగుండం సీపీ ఎం శ్రీనివాస్ తెలిపారు. ఈ సందర్భంగా సీపీ మాట్లాడుతూ పెద్దపల్లి రంగంపల్లిలోని వెంకటపద్మ ఫంక్షన్ హాల్లో బందోబస్తుకు వచ్చిన పోలీస్ అధికారులకు, సిబ్బందికి భద్రతాపరమైన సూచనలు చేశామ న్నారు. మొత్తం 200 మంది పోలీసు అధికారులు సిబ్బందితో పటిష్ట బందోబస్తు ఏర్పాటు చేశామన్నారు. ఏడుగురు ఎస్పీలు, అదనపు ఎస్పీలు 3, డీఎస్పీ/ఏసీపీలు 15, సీఐలు 48, ఎస్సైలు 124, మహిళా ఎస్‌ఐలు 15, ఏఎస్సై/ హెడ్ కానిస్టేబుళ్ళు 316, కానిస్టేబుళ్ల 846, హోంగార్డు 384 మంది, క్యూఆర్టీ మెంబర్స్ 70, 10 స్పెషల్ పార్టీలతో పక డ్బందీగా బందోబస్తు ఏర్పాటు చేసినట్లు వివరించారు.

పెద్దపల్లి కలెక్టరేట్‌లోని హెలి ప్యాడ్, పబ్లిక్ మీటింగ్, శిలాఫల కాల ప్రారంభోత్సవాల, రూఫ్ టాప్, పబ్లిక్ మీటింగ్, డయాస్, పార్కింగ్ ప్రాంతాల వద్ద ఉండే పోలీసు అధికారులకు భద్రతా పరమైన సూచనలు ఇచ్చినట్లు తెలిపారు. పోలీసు బందో బస్తు ను సెక్టార్లుగా విభజించి డీఎస్పీ/ఏసీపీలు ఇన్‌చార్జీలుగా భారీ బందోబస్తును ఏర్పాటు చేసినట్లు పేర్కొన్నారు. రోప్ పార్టీలు, రోడ్ ఓపెనింగ్ పార్టీలు, పెట్రోలింగ్ పార్టీలు, ట్రాఫిక్ డైవర్షన్, పికెటింగ్, బిడి టీమ్స్ మొదలగు బందోబస్తు ఏర్పాటు చేసినట్లు తెలిపారు. ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి పర్యటన సందర్భంగా పోలీస్ అధికా రులు సిబ్బంది తమకు కేటాయించిన ప్రదేశాల్లో అప్రమత్తంగా ఉం డి, విధులు నిర్వర్తించే సమయంలో సంయమనం పాటించా లని, పార్కింగ్, ట్రాఫిక్ డైవర్షన్ సెక్టార్ పోలీసులు అప్రమత్తంగా ఉండా లని, ట్రాఫిక్ జామ్ కాకుండా చూడాలని సూచించినట్లు తెలిపారు..

సభాస్థలిని పరిశీలించిన మల్టీజోన్ ఐజీ చంద్రశేఖర్‌రెడ్డి

ముఖ్యమంత్రి పర్యటన నేపథ్యంలో భద్రతా ఏర్పాట్లను మల్టీ జోన్ ఐజీ-1 చంద్రశేఖర్‌రెడ్డి సందర్శించారు. ఈ సందర్భంగా, ఐజీ సభా ప్రాంగణంలో భద్రతా ఏర్పాట్లు, వేదిక నిర్వహణ, వీఐపీ ప్రాంతాల సమీక్ష నిర్వహించారు. ఆయా ప్రాంతాల్లో పోలీసు బందో బస్తు ఏర్పాటు పరిశీలించారు. వీఐపీల కోసం ప్రత్యేక ప్రవేశ ద్వారా లు, ఇతర ఏర్పాట్లపై అధికారులకు స్పష్టమైన ఆదేశాలు జారీ చేశా రు. ప్రధాన రహదారులు, వాహనాల పార్కింగ్ కోసం ప్రత్యేక ప్రాంతాలకు అనుగుణంగా ఏర్పాట్లు చేయాలని ఆదేశించారు. ప్రజ ల ఎలాంటి ఇబ్బందులు కలుగకుండా, ఎలాంటి సంఘటనలు చోటుచేసుకోకుండా అన్ని ఏర్పాట్లు పకడ్బందీగా చేయాలని సూచనలు జారీ చేశారు.

కొండగట్టులో భక్తుల సందడి



ప్రత్యేక అలంకరణలో గర్భగుడి

మల్యాల, డిసెంబరు 3 (ఆంధ్ర జ్యోతి): కొండగట్టు ఆంజనేయస్వా మి సన్నిధానం మంగళవారం వేలాది గా తరలివచ్చిన భక్తులతో సందడిగా మారింది. కొండపైకి వచ్చిన భక్తులు స్వామి వారిని దర్శించుకున్నారు. వేకువజాము నుంచే వందలాది వాహనాలు, కాలినడకన కొండపైకి చేరుకున్న భక్తులు అంజన్నకు మొక్కులు తీర్చుకున్నారు. ఆలయం లో అభిషేక పూజలు జరిపారు. భక్తులకు ఇబ్బందులు కలగకుండా ఆలయ ఈవో రామకృష్ణరావు, ఏఈవో అంజయ్య, పర్యవేక్షకులు హరిహరనాథ్, సునీల్, చంద్రశేఖర్ తదితరులు భక్తుల రద్దీని పర్యవేక్షించారు.

● ప్రజాపాలన-ప్రజావిజయోత్సవాల్లో భాగంగా మంగళవారం ఆలయా న్ని పూలతో అలంకరించారు. ఈ సందర్భంగా ప్రత్యేక పూజలు జరిపారు. ఈవో రామకృష్ణరావు, అధికారులు, అర్చకులు పాల్గొన్నారు. విజయోత్సవాల సందర్భంగా ఆలయాన్ని ఇప్పటికే విద్యుత్‌దీపాలతో అలంకరించారు.

అంజన్నను దర్శించుకున్న హీరో వరుణ్‌తేజ్



వరుణ్‌తేజ్‌కు స్వామి వారి చిత్రపటం బహుకరిస్తున్న ఈవో, అర్చకులు

మల్యాల, డిసెంబరు 3 (ఆంధ్రజ్యోతి): మెగాస్టార్ చిరంజీవి కుటుంబానికి చెందిన హీరో వరుణ్‌తేజ్ మంగళవారం కొండగట్టు అంజనే యస్వామిని దర్శించుకున్నారు. హనుమాన్ దీక్షలో ఉన్న వరుణ్ ఆలయానికి రాగా ఈవో రామకృష్ణరావు, స్థానాచార్యులు కపేందర్, ప్రధానర్చకులు రామకృష్ణ ఘనంగా స్వాగతం పలికారు. అనంతరం ఆలయంలో ప్రత్యేక పూజలు జరిపారు. అనంతరం స్వామి వారి తీర్థ ప్రసాదాలు అందించగా ఈవో రామకృష్ణరావు శేషవస్త్రంతో సత్కరించి స్వామివారి చిత్రపటం బహుకరించారు. కార్యక్రమంలో ఏఈవో అంజయ్య పర్యవేక్షకులు హరిహర నాథ్, సునీల్, చంద్రశేఖర్, ఆలయ ఇన్‌స్పెక్టర్ రాజేందర్‌రెడ్డి తదితరులు ఉన్నారు. ఈ సందర్భంగా వరుణ్‌తేజ్ మాట్లాడుతూ హనుమాన్ దీక్ష తీసుకున్న తాను స్వామి వారిని దర్శించుకోవ డం సంతోషంగా ఉందని అన్నారు.

వెటర్నరీ యూనివర్సిటీ ఆధ్వర్యంలో పశువైద్య శిబిరం

సైదపూర్, డిసెంబరు 3(ఆంధ్రజ్యోతి): మండలంలోని రాయికల్, వెంకటేశ్వ ర్లపల్లిలో పీవీ నర్సింహారావు తెలంగాణ వెటర్నరీ యూనివర్సిటీ, కాలేజ్ ఆఫ్ వెటర్నరీ సైన్స్ కోరుట్ల పశువైద్య, పశుసంవర్ధక శాఖ ఆధ్వర్యంలో పశు వైద్య శిబిరం నిర్వహించారు. వెంకటేశ్వర్లపల్లి గ్రామంలో పశువైద్య శిబిరాన్ని వ్యవసా య మార్కెట్ చైర్మన్ దొంత సుధాకర్ ప్రారంభించారు. ఈ సందర్భంగా 106 పాడి పశువులకు గర్భ పరీక్షలు, గర్భాశయ వ్యాధుల చికిత్స నిర్వహించారు. కార్యక్రమంలో ఎన్ఎస్ఎస్ ప్రోగ్రాం అధికారులు డాక్టర్ జి అంబిక, డాక్టర్ అనీ ల్, 52 మంది విద్యార్థులు, కరీంనగర్ పశు గణాభివృద్ధి సంస్థ కార్యనిర్వహణ అధికారి డాక్టర్ ఎన్ సత్యప్రసాద్‌రెడ్డి, పశువైద్యాధికారులు పాల్గొన్నారు.

పెన్షనర్ల సమస్యలను పరిష్కరించాలి



సమావేశంలో మాట్లాడుతున్న హరి అశోక్ కుమార్

జగిత్యాల అర్బన్, డిసెంబరు 3 (ఆంధ్రజ్యో తి): రాష్ట్రంలోని పెన్షనర్ల సమస్యలను వెంటనే పరిష్కరించాలని తెలంగాణ పెన్షనర్స్ సెంట్ర ల్ అసోసియేషన్ రాష్ట్ర కార్యదర్శి హరి అశోక్ కుమార్ రాష్ట్ర ప్రభుత్వాన్ని కోరారు. మంగళ వారం జిల్లా కేంద్రంలో జిల్లా స్థాయి పెన్షనర్స్ సమావేశం జరిగింది. ఈ సందర్భంగా ఆయ న మాట్లాడుతూ డిసెంబరు 17ను జాతీయ పెన్షన్ దినోత్సవాన్ని ఘనంగా నిర్వహించా లన్నారు. అన్ని కార్పొరేట్ ఆస్పత్రుల్లో పెన్షనర్ల కు నగదు వైద్య సేవలు అందించాలనిడి మాండ్ చేశారు. 2024 నుంచి రిటైర్ అయిన వారికి రావాల్సిన జీపీఎఫ్ గ్రాట్యుటీ కమ్యూనికేషన్ లీవ్ సాలరీ తదితర ప్రయోజనాలను వెంటనే విడుదల చేయాలన్నారు. అనంతరం 2025 డైరీని ఆయన ఆవిష్కరించారు. ఈ కార్యక్రమంలో జిల్లా కార్యదర్శి బొల్లం విజయ్, కోశాధికారి గౌరిశెట్టి విశ్వనాథం, పీసీ హన్మంతరెడ్డి, వేల్పుల ప్రకాష్ రావు, పూజా అశోక్, సత్యనారాయణ, కరుణ, విఠల్, మురళీధర్ తదితరులు పాల్గొన్నారు.

నియోజకవర్గ ప్రజలకు రుణపడి ఉంటా

- చొప్పదండి ఎమ్మెల్యే మేడిపల్లి సత్యం



సమావేశంలో మాట్లాడుతున్న ఎమ్మెల్యే మేడిపల్లి సత్యం

గంగాధర, డిసెంబరు 3 (ఆంధ్రజ్యోతి): నియోజకవర్గ ప్రజలకు రుణపడి ఉంటానని చొప్పదండి ఎమ్మెల్యే మేడిపల్లి సత్యం అన్నారు. ఎమ్మెల్యేగా ఎన్నికై ఏడాది పూర్తయిన సందర్భంగా గంగాధరలో ప్రెస్‌మీట్ నిర్వహిం చారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఎన్నికల హామీలను ఒక్కొక్కటిగా నెరవేర్చుతూ ముందుకు సాగు తున్నామన్నారు. నియోజకవర్గ ప్రజల సంక్షేమం కోసమే పనిచేస్తున్నట్లు తెలిపారు. నియోజకవర్గంలోని ఆరు మండలాలకు సాగునీరందించడానికి అసంపూర్తిగా ఉన్న ఓటీ పనులు నడుస్తున్నట్లు వెల్లడించారు. నియోజక వర్గంలో ఇంటిగ్రేటెడ్ స్కూల్‌ను త్వరలో ప్రారంభిస్తామ న్నారు. తన కుటుంబంలో విషాదం జరిగిన సమయంలో నియోజకవర్గ ప్రజలు అండగా నిలిచి మనోధైర్యం చెప్పారన్నారు. నియోజకవర్గ ప్రజలకు రుణపడి ఉంటాన ని అన్నారు. అంతకు ముందు మండలంలోని వివిధ గ్రామాలకు చెందిన 281 మంది కి మంజూరైన 7.50లక్షల సీఎం ఆర్ఎఫ్ చెక్కులను పంపిణీ చేశారు. కార్యక్రమంలో చొప్పదం డి మున్సిపల్ చైర్‌పర్సన్ గుర్రం నీరజ, చొప్పదండి, రామడుగు, బొయినపల్లి మండలాల మార్కె ట్ కమిటీ చైర్మన్లు మహేష్, బొమ్మరవేణి తిరుమల, ఎల్లేష్ యాదవ్, చొప్పదండి మున్సిపల్ కౌన్సిలర్ అశోక్, ఐదు మండలా ల కాంగ్రెస్ పార్టీ అధ్యక్షులు ఇప్ప శ్రీనివాస్‌రెడ్డి, మనోహర్, నారాయణ, ఆనందరెడ్డి, రమణారెడ్డి, నాయకులు కార్యకర్తలు పాల్గొన్నారు.

బద్ది పోచమ్మకు బోనం మొక్కులు



బద్ది పోచమ్మ దర్శనం కోసం క్యూలైన్‌లో బోనాలతో నిరీక్షిస్తున్న భక్తులు

వేములవాడ కల్చరల్, డిసెంబరు 3 (ఆంధ్రజ్యోతి): పిల్లపాపలు, పాడిపంటలు చల్లంగా చూడమ్మా అంటూ భక్తులు బద్ది పోచమ్మను వేడుకున్నారు. వేములవాడలోని బద్ది పోచమ్మ అమ్మవారి ఆలయం మంగళవారం భక్తులతో కిటకిటలాడింది. సోమవారం ఉదయం రాజన్న దర్శనం చేసుకున్న భక్తులు రాత్రి ఆలయ వసతి గదుల్లో విడిది చేశారు. మంగళవారం ఉదయం అమ్మవారికి మట్టి కుండల్లో నైవేద్యాన్ని వండుకొని డప్పుచప్పుళ్ల మధ్య బద్దిపోచమ్మ ఆలయానికి తరలివచ్చారు. అమ్మవారికి పట్నాలు వేసి ఒడిబియ్యం పోశారు. అనంతరం నైవేద్యాన్ని సమర్పించి మొక్కులు చెల్లించుకున్నారు. భక్తులకు ఇబ్బందులు తలెత్తకుండా ఆలయ ఈవో వినోద్‌రెడ్డి నేతృత్వంలో ఏర్పాట్లను పర్యవేక్షించారు.

రాష్ట్రస్థాయి త్రో బాల్‌లో విద్యార్థినుల ప్రతిభ



జ్ఞాపిక, ప్రశంసాపత్రాలతో విద్యార్థినులు

ఎల్లారెడ్డిపేట, డిసెంబరు 3 (ఆంధ్రజ్యోతి):రాష్ట్ర స్థాయి త్రో బాల్ పోటీల్లో ఎల్లారెడ్డిపేట మండలం గొల్లపల్లి విద్యార్థినులు ప్రతిభ కనబరిచారు. హైదరాబాద్‌లోని నాచారం ఢిల్లీ పబ్లిక్ స్కూల్‌లో ఈ నెల 2వ తేదీన ఇషా ఫౌండేషన్ ఆధ్వర్యంలో పోటీలు నిర్వహించినట్లు పీడీ, జట్టు కోచ్ అనిల్‌గౌడ్ మంగళవారం తెలిపారు. మొత్తం 26 జట్లు పాల్గొనగా గొల్లపల్లి విద్యార్థినులు సత్తా చాటి ప్రథమ స్థానంలో నిలిచారని పేర్కొన్నారు. ఈ నెల 28 నుంచి కోయంబత్తూరులో నిర్వహించనున్న జాతీయస్థాయి పోటీల్లో పాల్గొననున్న ట్లు చెప్పారు. ఈ సందర్భంగా విద్యార్థినులు పలువురు అభినందించారు.

గురుకులంలో విద్యార్థుల చన్నీటి స్నానాలు

- వేడి నీళ్లు లేక విద్యార్థుల ఇబ్బందులు



ఆరుబయట వాటర్ ట్యాంక్ వద్ద చన్నీట స్నానం చేస్తున్న విద్యార్థులు

మెట్‌పల్లి రూరల్, డిసెంబరు 3 (ఆంధ్రజ్యోతి): మండలంలోని పెద్దాపూర్ గురుకుల బాలురుల పాఠశాల, కళాశాలలోని విద్యార్థులు చన్నీటి స్నానాలతో ఇబ్బందులు పడుతున్నారు. ఇక్కడ ఐదవ తరగతి నుంచి ఇంటర్ వరకు 500 మంది విద్యార్థులు ఉన్నారు. రోజురో జుకూ చలి తీవ్రత పెరుగుతున్న క్రమంలో ఉదయం చన్నీటి స్నానాలు చేసేందుకు విద్యార్థులు వణికిపోతున్నారు. గురుకుల పాఠశాలల్లో విద్యార్థుల సౌకర్యార్థం గీజర్లు ఏర్పాటు చేయాల్సి ఉండగా అధికా రులు ఆ దిశగా చర్యలు తీసుకోకపోవడం గమనార్హం. అధికారులు, ప్రజాప్రతినిధులు పాలకులు స్పందించి విద్యార్థుల సమస్యలను పరిష్కరించాలని తల్లిదండ్రులు కోరుతున్నారు. కొద్ది రోజుల క్రితం గురుకులంలో జరిగిన సంఘటనలతో డిప్యూటీ సీఎం భట్టివిక్రమార్కతో రాష్ట్ర స్థాయి అధికారులు సందర్శించి విద్యార్థులకు ఎలాంటి ఇబ్బందులు కలగకుండా అన్ని ఏర్పాట్లు చేయాలని ఆదేశించారు. దీంతో ఉన్నతాధికారులు విద్యార్థులకు కాట్ బెడ్‌లతో పాటు దుప్పట్లు అందించారు. వాటితో పాటు మరికొన్ని వసతులను కల్పించారు.

వాటర్ హీటర్ ఏర్పాటు కోసం ప్రతిపాదనలు పంపాం

- మాధవీలత, గురుకులం ప్రిన్సిపాల్, పెద్దాపూర్

చలికాలం కావడంతో విద్యార్థులకు వేడినీటి వసతి కల్పించడానికి వాటర్ హీటర్‌లను ఏర్పాటు చేయడానికి ఉన్నత అధికారులకు ప్రతిపాదనలు పంపాము. ఇటీవలే విద్యార్థులకు కాట్‌బెడ్‌లతో పాటు బెడ్‌షీట్లు, దుప్పట్లు అందించాము.. విద్యార్థులకు ఎలాంటి ఇబ్బందులు లేకుండా అధికారులు అన్ని ఏర్పాట్లను సమకూరుస్తున్నారు.

ఆర్టీసీ ఆర్ఎంగా రాజు బాధ్యతల స్వీకరణ

భగత్ నగర్, డిసెంబర్ 3 (ఆంధ్రజ్యోతి): ఆర్టీసీ కరీంన గర్ రీజినల్ మేనేజర్‌గా బి.రాజు మంగళవారం బాధ్యతలు స్వీకరించారు. గతంలో ఆర్ఎంగా పనిచేసిన సుచరిత హైద రాబాద్‌కు బదిలీ ఆయ్యారు. నూతనంగా బాధ్యతలు స్వీక రించిన రీజనల్ మేనేజర్‌కు డిప్యూటి రీజనల్ మేనేజర్ కె సత్యనారాయణ, ఎస్ భూపతి రెడ్డి, పర్సనల్ ఆఫీసర్ చంద్రయ్య, అకౌంట్ ఆఫీసర్ మనోహర్ రెడ్డి తదితరులు శుభాకాంక్షలు తెలిపారు. అనంతరం ఆర్ఎం రాజు కలెక్టర్ పమేలా సత్పతిని, పోలీస్ కమిషనర్ అభిషేక్ మొహంతిని మర్యాదపూర్వకంగా కలిశారు. అనంతరం కరంనగర్ 2 డిపోను ఆర్ఎం సందర్శించి గ్యారేజీ సిబ్బందిని వివరాలు అడిగి తెలుసుకున్నారు.



ఆర్ఎం రాజుకు మొక్కను అందిస్తున్న ఆర్టీసీ అధికారులు

జాతీయ కరాటే పోటీల్లో విద్యార్థుల ప్రతిభ



క్రీడాకారులను అభినందిస్తున్న సీపీ అభిషేక్ మొహంతి

కరీంనగర్ స్పోర్ట్స్, డిసెంబరు 3 (ఆంధ్రజ్యోతి): ఒకినావా మార్షల్ ఆర్ట్స్ అకాడమీ ప్రతిష్ఠాత్మకంగా మహారాష్ట్రలోని పుణే పట్టణంలోని ఛత్రపతి స్పోర్ట్స్ స్టేడియంలో నవంబరు 28 నుంచి డిసెంబరు 1 వర కు నిర్వహించిన 27వ జాతీయస్థాయి కరాటే పోటీ ల్లో కరీంనగర్ ఒకినావా స్కూల్ విద్యార్థులు 19 పత కాలు సాధించారు. ఈ సందర్భంగా వారిని పోలీస్ కమిషనర్ అభిషేక్ మొహంతి, ట్రైనీ ఐపీఎస్ వసుం ధర అభినందించారు. ఈ సందర్భంగా ఒకినా వా సంస్థల చీఫ్ అఫీషియల్ కె వసంత్‌కుమార్ మా ట్లాడుతూ విద్యార్థులు ఆరు గోల్డ్ పతకాలు, ఐదు సిల్వర్ పతకాలు, ఎనిమిది బ్రాంజ్ పతకాలు సాధిం చినట్లు తెలిపారు. కోచ్‌గా కరీంనగర్ నుంచి పుల్లూరి శ్రీనివాస్, మేనేజర్‌గా కె రాజశేఖర్ వ్యవహరించారు.

రూ.7150 పలికిన పత్తి ధర

జమ్మికుంట, డిసెంబరు 3 (ఆంధ్రజ్యో తి): జమ్మికుంట వ్యవసాయ మార్కెట్లో క్వింటాల్ పత్తి ధర రూ.7150 పలికింది. మంగళవారం మార్కెట్ యార్డుకు పది మంది రైతులు 102క్వింటాళ్ల విడి పత్తి, ఐదుగురు రైతులు పది క్వింటాళ్లు గోనె సంచుల్లో విక్రయానికి తీసుకువచ్చారు. ప్రైవేట్ ట్రేడర్స్ బహిరంగ వేలం పాట ద్వారా గరిష్ఠ ధర 7,150 రూపాయలు, కనిష్ఠ ధర 6500 రూపాయలు చెల్లించి పత్తి కొనుగోళ్లు చేపట్టారు. అదేవిధంగా 230 మంది రైతులు 3,815 క్వింటాళ్ల పత్తిని కాటన్ కార్పోరేషన్ ఆఫ్ ఇండియా (సీసీఐ) కి మద్దతు ధర ప్రకారం విక్రయించారు.

రాష్ట్రస్థాయి వైజ్ఞానిక పోటీలకు ఎంపిక

చిగురుమామిడి, డిసెంబరు 3 (ఆంధ్ర జ్యోతి): మండలంలోని ఇందుర్తి గ్రామంలో ని ప్రభుత్వ పాఠశాలకు చెందిన అష్ట మహేవిష్ అనే విద్యార్థి రాష్ట్రస్థాయి వైజ్ఞాని క పోటీలకు ఎంపికైనట్టు పాఠశాల ప్రధానో పాధ్యాయురాలు జయప్రద మంగళవారం ఒక ప్రకటనలో తెలిపారు. 'ఆవు పేడ మన నిత్య జీవిత అవసరాలను ఎలా తీరుస్తుంది' అనే ప్రదర్శన రాష్ట్రస్థాయి పోటీలకు ఎం పికైందన్నారు. విద్యార్థిని పాఠశాల ఉపాధ్యా యులు అభినందించారు. సైన్స్ ఉపాధ్యా యుడు ఓదెలుకుమార్‌ను సన్మానించినారు.

రాష్ట్ర స్థాయి ఇన్‌స్పైర్ అవార్డుకు ఎంపిక

చొప్పదండి, డిసెంబరు 3 (ఆంధ్రజ్యోతి): మండలంలోని రుక్మాపూర్ మోడల్ స్కూల్ కు చెందిన తొమ్మిదో తరగతి విద్యార్థి గౌతం రాష్ట్రస్థాయి ఇన్‌స్పైర్ అవార్డుకు ఎంపిక అయ్యాడు. జిల్లా స్థాయి వైజ్ఞానిక ప్రదర్శన లో గౌతం ప్రతిభ కనబరచి రాష్ట్రస్థాయికి ఎంపిక అయ్యాడు. గౌతంను ప్రిన్సిపాల్ సుధాకర్, గైడ్ టీచర్లు రాధ, ముక్తిప్రసాద్ అభినందించారు.

● చొప్పదండి జడ్పీ బాలుర ఉన్నత పాఠశాల విద్యార్థి శ్రావణ్‌కుమార్‌కు జిల్లా స్థాయి వైజ్ఞానిక ప్రదర్శనలో ద్వితీయ బహు మతి లభించింది. ప్రధానోపాధ్యాయులు రాజిరెడ్డి, ఉపాధ్యాయులు శ్రావణ్ కుమార్ అభినందించారు.

మున్సిపల్ కార్మికులకు వైద్యశిబిరం

సుభాష్‌నగర్, డిసెంబరు 3(ఆంధ్రజ్యోతి): ప్రజాపాలన వారోత్సవాలలో భాగంగా జిల్లా వైద్య ఆరోగ్యశాఖ అధికారి డాక్టర్ వెంకట రమణ ఆధ్వర్యంలో మున్సిపల్ కార్మికుల కోసం మెడికల్ క్యాంపు నిర్వహించారు. మహిళా కార్మికులకు బ్రెస్ట్ క్యాన్సర్, సెర్వైకల్ క్యాన్సర్‌పై అవగాహన కల్పించారు. ఈ మెడికల్ క్యాంపులో మున్సిపల్ కమిషనర్ చాహత్‌బాజ్‌పాయ్, డాక్టర్ సనాజువేరియా, తదితరులు పాల్గొన్నారు.

రాష్ట్రస్థాయి జూడో పోటీలకు ఎంపిక

కరీంనగర్ స్పోర్ట్స్, డిసెంబరు 3 (ఆంధ్రజ్యోతి): వరంగల్ జిల్లాలో జరగనున్న రాష్ట్రస్థాయి అండర్-19 జూడో చాంపియన్‌షిప్ పోటీలకు కరీంనగర్‌లోని అల్ఫోర్స్ జూనియర్ కళాశాలకు చెందిన విద్యార్థినులు ఎంపికయ్యారు. ఇటీవల జరిగిన ఉమ్మడి జిల్లాస్థాయి ఎంపిక పోటీల్లో రాణించిన బింగి మన్విత, ఎల్ చైత్రలు రాష్ట్ర పోటీలకు ఎంపికయ్యారు. ఈ సందర్భంగా ఎంపికైన విద్యార్థులను జిల్లా కళాశాలల క్రీడా సమాఖ్య కార్యదర్శి జి మధుజాన్సన్, అల్ఫోర్స్ అధినేత నరేందర్‌రెడ్డి అభినందించారు.

న్యాయవాదులకు సన్మానం

కరీంనగర్ లీగల్, డిసెంబరు 3 (ఆంధ్రజ్యోతి): న్యాయవాదుల దినోత్సవాన్ని పురస్కరించుకుని టీపీసీసీ జాయింట్ కన్వీనర్ భూక్యా రజనీష్, కరీంనగర్ జిల్లా కాంగ్రెస్ లీగల్ సెల్ చైర్మన్ కల్లేపెల్లి లక్ష్మయ్య ఆధ్వర్యంలో మంగళవారం పలువురు సీనియర్ న్యాయవాదులను సన్మానించారు. కరీంనగర్ బార్ అసోసియేషన్ న్యాయవాదుల మీటింగ్ హాల్‌లో సీనియర్ న్యాయవాదులు గులాబీల మల్లారెడ్డి పటేల్, మరోజు రామకృష్ణ చారి, మెట్ట అనిల్ కుమార్, డి మల్లయ్య, కుసుంబా కృష్ణరావు, కొరివి వేణు గోపాల్‌ను సన్మానించారు. కార్యక్రమంలో లీగల్ సెల్ బాధ్యులు కృష్ణ, శంకర్, శ్రీకాంత్, శ్రీరాముల కిషన్, సృజన్ పాల్గొన్నారు.

7న సుబ్రహ్మణ్యస్వామి కల్యాణం

కరీంనగర్ కల్చరల్, డిసెంబరు 3 (ఆంధ్రజ్యోతి): నగరంలోని భగత్‌నగర్ జెడ్‌పి క్వార్టర్స్ ఆవరణలోని అయ్యప్ప దేవాలయంలో సుబ్రహ్మణ్య షష్ఠి సందర్భంగా శనివారం ఉదయం 8-30 గంటల నుంచి హోమం, అభిషేకం జరుగుతుందని ఈవో కొన్న కాంతారెడ్డి ఒక ప్రకటనలో తెలిపారు. సాయంత్రం పురాణం మహేశ్వరశర్మ వైదిక నిర్వహణలో కల్యాణం జరుగుతుందని పేర్కొన్నారు. రాత్రి పడిపూజ ఉంటుందని, దీక్షాపరులు పాల్గొని తరించాలని కోరారు.

దివ్యాంగుల సంక్షేమానికి చర్యలు

-కలెక్టర్ పమేలా సత్పతి -జిల్లావ్యాప్తంగా అంతర్జాతీయ దివ్యాంగుల దినోత్సవం



రేకుర్తిలో దివ్యాంగుల పాఠశాల విద్యార్థికి షూ పంపిణీ చేస్తున్న కలెక్టర్ పమేలాసత్పతి

కరీంనగర్‌టౌన్, డిసెంబరు 3 (ఆంధ్రజ్యోతి): దివ్యాంగుల సంక్షేమానికి చర్యలు తీసుకుంటున్నట్లు కలెక్టర్ పమేలా సత్పతి అన్నారు. దివ్యాంగులు అవకాశాలను సద్వినియోగం చేసుకోవాలన్నారు. అంతర్జాతీయ దివ్యాంగుల దినోత్సవాన్ని పురస్కరించుకొని మంగళవారం కలెక్టరేట్ ఆడిటోరియంలో ఏర్పాటు చేసిన కార్యక్రమాన్ని జ్యోతి ప్రజ్వలన చేసి ఆమె ప్రారంభించారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ దివ్యాంగుల కోసం మండల కేంద్రాల్లో ఏర్పాటుచేసిన భవిత విద్యా వనరుల కేంద్రాన్ని నెలకు ఒకసారి సందర్శించాలని అధికారులు, ప్రజా ప్రతినిధులకు సూచించారు. దివ్యాంగుల కోసం అదనపు కలెక్టర్ గ్రంథాలయం ఏర్పాటు చేశారని దానిని సద్వినియోగం చేసుకోవాలన్నారు. సుడా చైర్మన్ కోమటిరెడ్డి నరేందర్‌రెడ్డి మాట్లాడుతూ కాంగ్రెస్ ప్రభుత్వం అందించే ఇళ్లలో దివ్యాంగులకు ప్రాధాన్యమిస్తామన్నారు. అదనపు కలెక్టర్ ప్రఫుల్ దేశాయ్ మాట్లాడుతూ దివ్యాంగులకు ఏవైనా సమస్యలు ఉంటే తమను సంప్రదిస్తే పరిష్కరిస్తామని పేర్కొన్నారు. దివ్యాంగురాలైన అధ్యాపకురాలు మహంకాళి సుగుణ రాసిన బుక్ ను ఆవిష్కరించారు. అనంతరం దివ్యాంగులకు మద్దతుగా సిగ్నేచర్ క్యాంపెయిన్ నిర్వహించారు. ఈ సందర్భంగా దివ్యాంగులు ప్రదర్శించిన నృత్యాలు ఆకట్టుకున్నాయి. అనంతరం ఉపాధి హామీ పథకం కింద 100 రోజుల పని దినాలు పూర్తి చేసుకున్న 35 మంది దివ్యాంగులైన కూలీలను డీఆర్డీవో శ్రీధర్ సన్మానించారు. కార్యక్రమంలో డీఎంహెచ్‌వో వెంకటరమణ, సీడబ్ల్యూసీ చైర్ పర్సన్ ధనలక్ష్మి, ఇన్‌చార్జి డీడబ్ల్యూవో సబిత పాల్గొన్నారు.

బూట్లు పంపిణీ

భగత్‌నగర్: రేకుర్తిలోని ప్రభుత్వ అంధుల, బధిర ఆశ్రమ పాఠశాల విద్యార్థులకు కలెక్టర్ పమేలా సత్పతి షూ, సాక్సులు అందజేశారు. అనంతరం ఆటల పోటీల్లో గెలుపొందిన విద్యార్థులకు కలెక్టర్ ప్రశంసాపత్రాలు అందజేశారు. కార్యక్రమంలో అడిషనల్ కలెక్టర్ ప్రఫుల్‌దేశాయ్, ఎస్సీ కార్పొరేషన్ ఈడీ నాగార్జున, అంధుల ఆశ్రమ పాఠశాల ప్రిన్సిపాల్ నర్మద, బధిరుల పాఠశాల ప్రిన్సిపాల్ కమల పాల్గొన్నారు.

●కరీంనగర్‌టౌన్: నగరంలోని అంధుల పాఠశాలలో దివ్యాంగుల దినోత్సవాన్ని జరుపుకున్నారు. ఈ సందర్భంగా జిల్లా న్యాయ సేవాధికార సంస్థ కార్యదర్శి సీనియర్ సివిల్ జడ్జి కే వెంకటేష్ మాట్లాడుతూ వైకల్యం ఉందని కుంగిపోకుండా కష్టపడి వివిధ రంగాలలో ఉన్నత శిఖరాలను అధిరోహించాలని విద్యార్థులకు తెలిపారు. ఈ సందర్భంగా వివిధ ఆటలలో విజయం పొందిన విద్యార్థులకు బహుమతులు అందజేశారు. కార్యక్రమంలో జిల్లా స్త్రీ, శిశు సంక్షేమ శాఖ అధికారి సబిత, లీగల్ ఎయిడ్ డిఫెన్స్ కౌన్సిల్ తణుకు పాఠశాల ప్రధానోపాధ్యాయురాలు నర్మద పాల్గొన్నారు.

●హుజూరాబాద్: దివ్యాంగుల సమస్యల పరిష్కారానికి ప్రభుత్వం కృషి చేస్తోందని హుజూరాబాద్ నియోజకవర్గ కాంగ్రెస్ పార్టీ ఇన్‌చార్జి వొడితెల ప్రణవ్ అన్నారు. మంగళవారం హుజూరాబాద్ పట్టణంలోని కాంగ్రెస్‌పార్టీ కార్యాలయంలో అంతర్జాతీయ దివ్యాంగుల దినోత్సవం సందర్భంగా ప్రణవ్ కేక్ కట్ చేసి, దివ్యాంగులకు స్వీట్లు పంపిణీ చేశారు. అనంతరం దివ్యాంగులు ఎదుర్కొంటున్న సమస్యలపై ప్రణవ్‌కు వినతిపత్రం అందజేశారు. కార్యక్రమంలో దివ్యాంగ సమాచార వ్యవస్థాపక అధ్యక్షుడు రాఘవుల శ్రీనివాస్ పాల్గొన్నారు.

●శంకరపట్నం: మండల కేంద్రంలోని భవిత కేంద్రంలో దివ్యాంగ విద్యార్థులకు క్రీడా పోటీలు నిర్వహించారు. విజేతలకు ఎంఈవో లక్ష్మీనారాయణ, కాంప్లెక్స్ హెచ్ఎం సుభాష్‌రెడ్డి బహుమతులను అందజేశారు.

●వీణవంక: మండల కేంద్రంలోని శ్రీ సాయి ఆదర్శ దివ్యాంగుల సేవా సంఘం మండల శాఖ అధ్యక్షుడు పైడిపల్లి శ్రీనివాస్‌గౌడ్ మంగళవారం కేక్ కట్‌చేశారు. మండల కేంద్రంలోని ఎమ్మార్సీ కార్యాలయంలో దివ్యాంగ విద్యార్థులకు పోటీలను నిర్వహించి ఎంఈవో శోభారాణి బహుమతులను ప్రదానం చేశారు.

●చొప్పదండి: దివ్యాంగుల అభ్యున్నతి కోసం ప్రభుత్వం కృషి చేస్తుందని మండల విద్యాధికారి శ్రీనివాస్ దీక్షితులు అన్నారు. క్రీడా పోటీలను నిర్వహించి విజేతలకు బహుమతులను అందజేశారు. కార్యక్రమంలో హెచ్ఎం వైద్యుల రాజిరెడ్డి పాల్గొన్నారు.

●రామడుగు: మండల కేంద్రంలోని ఎమ్మార్సీ కార్యాలయంలోని భవిత కేంద్రంలో విద్యార్థులకు వివిధ రకాల పోటీలను నిర్వహించి బహుమతులను ప్రదానం చేశారు. కార్యక్రమంలో ఎంఈవో వేణుకుమార్, కాంప్లెక్స్ హెచ్ఎం శ్రీనివాస్ ఉన్నారు.

●మానకొండూర్: మానకొండూర్‌లోని ఎమ్మార్సీ కార్యాలయంలో నిర్వహించిన కార్యక్రమానికి జిల్లా విద్యాశాఖ సెక్టోరల్ అధికారి ఆంజనేయులు, మండల విద్యాధికారి ఎం. మధుసుధనాచారి, కాంప్లెక్స్ ప్రధానోపాధ్యాయులు డి. శ్రీనివాస్, ఉపాధ్యాయులు జీవన్, లకన్‌బాబు, ఉమారాణి, రాంప్రసాద్ పాల్గొన్నారు.

వివాదాస్పదంగా కళాభారతి పునఃప్రారంభం

కరీంనగర్ టౌన్, డిసెంబరు 3 (ఆంధ్రజ్యోతి): నగర పాలక సంస్థ పరిధిలోని కళాభారతిని ఆగమేఘాలపై పునఃప్రారంభించడం వివాదాస్పదం అవుతోంది. మేయర్ సునీల్‌రావు కళాభారతి పనులను పరిశీలించి, చివరి దశకు చేరుకున్నాయని, త్వరలోనే పునః ప్రారంభిస్తామని ప్రకటించారు. కానీ ఆ మరునాడే ప్రారంభోత్సవం చేయడంపై పలువురు అసంతృప్తి వ్యక్తం చేస్తున్నారు. కార్యక్రమానికి కనీసం డివిజన్ కార్పొరేటర్‌ను కూడా ఆహ్వానించకపోవడం సరికాదని అధికారుల తీరుపై కార్పొరేటర్లు మండిపడుతున్నారు. ప్రజాపాలన విజయోత్సవాల్లో భాగంగా ప్రారంభించినా అధికార కాంగ్రెస్ పార్టీకి కనీస సమాచారం ఇవ్వకపోవడం, మేయర్‌కు ఒక్కరోజు ముందైనా సమాచారం తెలుపకపోవడం అధికారుల ఇష్టారాజ్యానికి నిదర్శనమని పలువురు కార్పొరేటర్లు ఆగ్రహం వ్యక్తం చేస్తున్నారు.

వైజ్ఞానిక ప్రదర్శనలో కోరా జాన్సన్ విద్యార్థి ప్రతిభ

కరీంనగర్ టౌన్, డిసెంబరు 3 (ఆంధ్రజ్యోతి): కొత్తపల్లిలోని సెయింట్‌జార్జ్ పాఠశాలలో ఇటీవల నిర్వహించిన వైజ్ఞానిక ప్రదర్శనలో నగరంలోని కోరా జాన్సన్ పాఠశాల విద్యార్థి పి. అక్షయ్ కుమార్ ప్రతిభ చాటాడు. సైన్స్ ఫెయిర్‌లో రెయిన్ వాటర్ డిటెక్టర్, క్లాత్ ప్రొటెక్టర్ నమూనాలను ప్రదర్శించిన అక్షయ్ కుమార్ డిజాస్టర్ మేనేజ్‌మెంట్ టీమ్‌లో మొదటి స్థానాన్ని సాధించాడు. దీంతో అక్షయ్ కుమార్‌ను పాఠశాల చైర్మన్ మహిపాల్ రెడ్డి, డైరెక్టర్లు వరప్రసాద్, రాంరెడ్డి, సింహాచలం హరిక్రిష్ణ, వంగళ సంతోష్‌రెడ్డిలు అభినందించారు.

'నరేందర్‌రెడ్డిపై విమర్శలు సరికాదు'

గణేశ్‌నగర్,డిసెంబర్ 3(ఆంధ్రజ్యోతి): ఎమ్మెల్సీ అభ్యర్థి నరేందర్‌రెడ్డిపై విమర్శలు చేయడం సరి కాదని తెలంగాణ రాష్ట్ర బీసీ విద్యార్థి సంఘం ఉమ్మడి జిల్లా అధ్యక్షుడు సిరిశెట్టి రాజేష్ గౌడ్ అన్నారు. మంగళవారం జిల్లా కేంద్రంలో ఆయన మాట్లాడుతూ పట్టభద్రుల ఎమ్మెల్సీ అభ్యర్థి నరేందర్‌రెడ్డికి వస్తున్న ఆదరణ చూసి ఓర్వలేక కొంతమంది విమర్శలు చేస్తున్నారన్నారు. పట్టభద్రుల ఆత్మీయ సమ్మేళనంలో విద్యార్థులు అభిమానంతో సాంస్కృతిక కార్యక్రమాలు చేపడితే దానిని సైతం రాజకీయాలు చేయడం సిగ్గు మాలిన చర్యఅన్నారు. కార్యక్రమంలో శివ సాయి, విశాల్, అక్షయ్,హర్ష పాల్గొన్నారు.

కరపత్రం ఆవిష్కరణ

కరీంనగర్ కల్చరల్, డిసెంబరు 3 (ఆంధ్రజ్యోతి): బొమ్మకల్‌రోడ్‌లోని పరంధామాశ్రమం, పంచముఖ హనుమాన్ దేవాలయంలో మంగళవారం పరబ్రహ్మానందగిరిస్వామి చేతుల మీదుగా ఈ నెల 22న జరిగే హనుమాన్ వ్రత కరపత్రావిష్కరణ జరిగింది. ఈ కార్యక్రమంలో పిట్ల స్వామి, దేవిశెట్టి హనుమాండ్లు, గంప జగన్, ఆదిమూలం విద్యాసాగర్, తోట రాజేందర్, రామిడి నందం, వేణుగోపాలాచారి, గంద్ర లంజన్‌రావు, కడారి శ్రీనివాస్, బోగ మునీందర్, సరిత, లక్ష్మి, వనజ, శారద పాల్గొన్నారు.

గురుకులాల్లో గజగజ..

(3వ పేజీ తరువాయి)

రాజకీయ పక్షాలు, విద్యార్థి సంఘాలు గురుకుల విద్యార్థుల బాధలను తీర్చాలని ఆందోళనలు చేస్తున్నా ఫలితం లేకుండా పోతున్నది. అనేక సమస్యలతో గురుకులాలు విద్యార్థులు అస్వస్థతకు గురవుతున్నా ప్రభు త్వం పట్టించుకోవడం లేదని, బీఆర్ఎస్ విద్యార్థి విభాగం గురుకుల సందర్శన కార్యక్రమాన్ని చేపట్టింది. చొప్పదండి మాజీ ఎమ్మెల్యే సుంకె రవిశంకర్ గురుకులాన్ని సందర్శించేందుకువ వెళ్లగా ఆయనను పోలీసులు అడ్డుకున్నారు. మరోవైపు విద్యార్థి సంఘాలు గురుకులాల్లోని సమస్యలపై ఆందోళనబాట పట్టాయి. చలికాలం ప్రారంభంలోనే విద్యార్థులు అనారోగ్యా లకు గురవుతున్నందున మరో రెండు నెలలపాటు చలితీవ్రత అధికంగా ఉంటుందని, వెంటనే ప్రభుత్వం దుప్పట్లను పంపిణీ చేయాలని, కిటికిలకు తలుపులు బిగించాలని, దోమలను అరికట్టాలని తల్లిదండ్రులు డిమాండ్ చేస్తున్నారు.

నారుమడి పెంపకంలో జాగ్రత్తలు తీసుకోవాలి

భగత్‌నగర్, డిసెంబరు 3 (ఆంధ్రజ్యోతి): యాసంగిలో నారుమడి పెంపకంలో జాగ్రత్తలు తీసుకోవాలని జిల్లా వ్యవసాయ అధికారిణి భాగ్యలక్ష్మి సూచించారు. మంగళవారం రైతు నేస్తం కార్యక్రమంలో భాగంగా కొత్తపెల్లి రైతు వేదికలో నిర్వహించిన కార్యక్రమంలో జిల్లా వ్యవసాయ అధికారిణి పాల్గొన్నారు. నారుమడి పెంపకంలో తీసుకోవాల్సిన జాగ్రత్తలను శాస్త్రవేత్తలు వివరించారు. కార్యక్రమంలో కరీంనగర్ డివిజన్ ఏడీఏ, రణధీర్ కుమార్, వ్యవసాయ అధికారి కృష్ణ, ఏఈఓలు రాము రాజేంద్రప్రసాద్, తిరుపతి పాల్గొన్నారు.

గురుకుల పాఠశాల తనిఖీ



విద్యార్థులతో కలిసి భోజనం చేస్తున్న జిల్లా మైనార్టీ వెల్ఫేర్ ఆఫీసర్ పవన్ కుమార్

కరీంనగర్ రూరల్, డిసెంబరు 3 (ఆంధ్రజ్యోతి): కరీంనగర్ మండలంలో బొమ్మకల్ మైనార్టీ బాయ్స్1 స్కూల్, కాలేజీని మంగళవారం జిల్లా మైనార్టీ వెల్ఫేర్ ఆఫీసర్ పవన్ కుమార్ ఆకస్మికంగా తనిఖీ చేశారు. అనంతరం విద్యార్థులతో కలసి మధ్యాహ్న భోజనం చేశారు. మధ్యాహ్న భోజనం, పరిశుభ్రతపై ఆయన సంతృప్తి వ్యక్తం చేశారు.

'పట్టభద్రుల సమస్యలు పరిష్కరిస్తా'



బైక్ ర్యాలీ నిర్వహిస్తున్న పట్టభద్రుల ఎమ్మెల్సీ అభ్యర్థి యాదగిరి శేఖర్‌రావు

కరీంనగర్ టౌన్, డిసెంబరు 3 (ఆంధ్రజ్యోతి): ఎమ్మెల్సీగా తనను గెలిపిస్తే పట్టభద్రుల సమస్యలు పరిష్కరిస్తానని ఎమ్మెల్సీ అభ్యర్థి, ట్రస్మా గౌరవ అధ్యక్షుడు యాదగిరి శేఖర్‌రావు అన్నారు. ఆయనకు మద్దతుగా మంగళవారం నగరంలో పట్టభద్రులు బైక్ ర్యాలీ నిర్వహించారు. ఈసందర్భంగా పలువురు పట్టభద్రులు యాదగిరి శేఖర్‌రావుకు మద్దతుగా నినాదాలు చేశారు.

అంతర పంటలతో అధిక దిగుబడులు

కరీంనగర్ రూరల్, డిసెంబరు 3 (ఆంధ్రజ్యోతి): అంతర పంటలతో అధిక దిగుబడులు సాధించవచ్చని మండల వ్యవసాయ అధికారి బి.సత్యం తెలిపారు. మంగళవారం కరీంనగర్ మండలంలో వ్యవసాయ అధికారి బి.సత్యం పలు గ్రామాల్లో పర్యటించారు. కార్యక్రమంలో ఏఈవో స్వర్ణలత పాల్గొన్నారు.

మాలల హక్కుల కోసం పోరాడాలి

సుభాషనగర్, డిసెంబరు 3(ఆంధ్రజ్యోతి): మాలల హక్కుల కోసం పోరాడాలని జాతీయ మాల మహానాడు రాష్ట్ర ప్రధాన కార్యదర్శి అంజయ్య అన్నారు. మంగళవారం నగరంలోని ప్రెస్‌భవన్‌లో ఆయన మాట్లాడుతూ రిజర్వేషన్ల పరిరక్షణ కోసం మాలల సింహగర్జన సభ నిర్వహించామన్నారు. సమావేశంలో జిల్లా అధ్యక్షుడు శంకర్, ప్రధాన కార్యదర్శి ఆంజనేయులు పాల్గొన్నారు.

భక్తిశ్రద్ధలతో సామూహిక సత్యనారాయణ వ్రతాలు



సామూహిక సత్యనారాయణ వ్రతంలో పాల్గొన్న భక్తులు

తిమ్మాపూర్, డిసెంబరు 3 (ఆంధ్రజ్యోతి): మండలంలోని రామకృష్ణ కాలనీ గ్రామంలో గల సీతారామాంజనేయసహిత గంగాభవాని శంకర దేవాలయంలో మంగళవారం సామూహిక సత్యనారాయణ వ్రతాలు భక్తిశ్రద్ధలతో నిర్వహించారు. కార్యక్రమానికి తోగుట పీఠాధిశ్వరులు మాధవానంద సరస్వతిస్వామి హాజరయ్యారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ పాపాలు చేయవద్దని, తల్లిదండ్రులను బాగా చూసుకోవాలని సూచించారు. నిత్యం దైవాన్ని ఆరాధించాలని, దైవమే భక్తులకు కావలసింది అందజేస్తుందని తెలిపారు. అనంతరం పాల, పుష్ప తీర్థ ప్రసాదాలు అందించారు. ఈ సందర్భంగా పూజలో పాల్గొన్న దంపతులకు బీజేపీ మండల అధ్యక్షులు సుగుర్తి జగదీశ్వర చారి దంపతులు నూతన వస్త్రాలను బహూకరించారు. అనంతరం పాల్గొన్న భక్తులకు అన్నదానం నిర్వహించారు. ఈ కార్యక్రమంలో ఆలయ కమిటీ నిర్వహకులు, భక్తులు పాల్గొన్నారు.

317 జీవో ఉపాధ్యాయులకు న్యాయం చేయాలి

- టీటీయూ జిల్లా అధ్యక్షుడు ఆదర్శన్‌రెడ్డి

మానకొండూర్, డిసెంబరు 3 (ఆంధ్రజ్యోతి): 317 జీవో ద్వారా నష్టపోయిన ఉపాధ్యాయులందరికీ న్యాయం చేయాలని తెలంగాణ టీచర్స్ యూనియన్(టీటీయూ) జిల్లా అధ్యక్షుడు పోలంపల్లి ఆదర్శన్‌రెడ్డి ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. మండలంలోని ముంజంపల్లి మండల పరిషత్ పాఠశాలలో ఆ సంఘం మండల సమావేశం మంగళవారం జరిగింది. ఈ సమావేశానికి ఆయన ముఖ్య అతిథిగా హాజరై మాట్లాడారు. 317 జీవో ద్వారా స్థానికత కోల్పోయిన ఉపాధ్యాయులందరికి ప్రత్యేక ఆర్డినెన్స్ తీసుక వచ్చి న్యాయం చేయాలన్నారు. అనంతరం టీటీయూ మండల కార్యవర్గాన్ని ఎన్నుకున్నారు. అధ్యక్ష కార్యదర్శులుగా ముప్పిడి సహదేవ్, బొడ్ల శ్రీనివాస్, అసోసియేట్ అధ్యక్షుడిగా ఎ మహేశ్, మహిళా అధ్యక్షురాలిగా టి సురేఖ ఏకగ్రీవంగా ఎన్నికఅయ్యారు. కార్యక్రమంలో టీటీయూ జిల్లా ప్రధాన కార్యదర్శి చంద్రశేఖర్, మహేందర్, జగన్‌మోహన్‌రెడ్డి పాల్గొన్నారు.

నిరుద్యోగ విజయోత్సవ సభను విజయవంతం చేయండి

హుజూరాబాద్, డిసెంబరు 3 (ఆంధ్రజ్యోతి): పెద్దపల్లి జిల్లా కేంద్రంలో బుధవారం జరిగే నిరుద్యోగ విజయోత్సవ సభను విజయవంతం చేయాలని హుజూరాబాద్ నియోజకవర్గ కాంగ్రెస్ పార్టీ ఇన్‌చార్జి వొడితెల ప్రణవ్ ఒక ప్రకటనలో కోరారు. నియోజకవర్గంలోని యువకులు, రైతులు, కార్మికులు, ప్రజలు, అభిమానులు అధిక సంఖ్యలో పాల్గొనాలని కోరారు.

జమ్మికుంట రూరల్: జమ్మికుంట మాజీ ఎంపీపీ, విద్యోదయ హైస్కూల్ చైర్మన్ ఏబూషి రామస్వామి అనారోగ్యంతో మృతిచెందగా హుజూరాబాద్ నియోజక వర్గ కాంగ్రెస్ పార్టీ ఇంచార్జ్ వొడితల ప్రణవ్‌బాబు వారి కుటుంబ సభ్యులను మంగళవారం పరామర్శించారు.

యువత మత్తు పదార్థాలకు బానిస కావద్దు

చొప్పదండిప డిసెంబరు 3(ఆంధ్రజ్యోతి): యువత మత్తు పదార్థాలకు బానిస కావద్దని కరీంనగర్ రూరల్ ఎక్సైజ్ సీఐ అశోక్ కుమార్ అన్నారు. మంగళవారం జవహర్ నవోదయ విద్యాలయంలో మత్తు పదార్థాలపై అవగాహన సదస్సు నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ మత్తుపదార్థాల వలన విద్యార్థులు మానసికంగా, శారీరకంగా ఇబ్బందులను ఎదుర్కొంటారని తెలిపారు. కార్యక్రమంలో ప్రిన్సిపాల్ మంగతాయారు, ఎస్ఐ విజయభాస్కర్ పాల్గొన్నారు.

పరిశోధనలు భావితరాలకు ఉపయోగపడాలి



డాక్టరేట్ అందుకుంటున్న శ్రీనిత

గణేశ్‌నగర్, డిసెంబరు 3 (ఆంధ్రజ్యోతి): పరిశోధనలు భావితరాలకు ఉపయోగపడే విధంగా నిర్వహించాలని చైతన్య డీమ్డ్ టూబే యూనివర్సిటీ వైస్ ఛాన్సలర్ క్రిష్టఫర్ అన్నారు. హైదరాబాద్-మొయినాబాద్‌లో గల చైతన్య డీమ్డ్ టూబే యూనివర్సిటీ కళాశాలలో కరీంనగర్‌లోని వావిలాలపల్లికి చెందిన బాలసాని శ్రీనిత గణిత శాస్త్ర విభాగంలో డాక్టరేట్ అందుకుంది. కంప్యూటేషనల్ ట్రీట్‌మెంట్ అండ్ డైనమిడ్స్ ఆఫ్ హీట్ అండ్ మాస్‌ట్రాన్స్ఫర్ ఇన్ మైక్రోపోలార్ ఫ్లూయిడ్ స్లో అనే అంశంపై ఆచార్య ఎం సుందరామ్, ఎండీ షంషుద్దీన్ పర్యవేక్షణలో బాలసాని శ్రీనిత పరిశోధన నిర్వహించారు. యూనివర్సిటీలో ఆమెకు డాక్టరేట్‌ను వైస్ ఛాన్సలర్ క్రిష్టఫర్ అందజేశారు. చీఫ్ అడ్మినిస్ట్రేట్ అధికారిణి స్వాతికరెడ్డి అధ్యాపకులు తరితరులు పాల్గొన్నారు.

మున్సిపల్ ఆధ్వర్యంలో ప్రజాపాలన విజయోత్సవాలు



జమ్మికుంటలో ర్యాలీ చేపడుతున్న మున్సిపల్ సిబ్బంది

హుజూరాబాద్, డిసెంబరు 3 (ఆంధ్రజ్యోతి): పట్టణంలో మున్సిపల్ చైర్‌పర్సన్ గందె రాధిక ఆధ్వర్యం లో మంగళవారం ప్రజాపాలన విజయోత్సవాలు జరిగాయి. ఈ సందర్భంగా పట్టణంలో పెద్దఎత్తున ర్యాలీ నిర్వహించారు. అనంతరం మున్సిపల్ కార్యాలయ ఆవరణలో ఏర్పాటు చేసిన సమావేశంలో పారిశుధ్య నిర్వహణ, మెప్మా విభాగంలో ఉత్తమ ప్రతిభ కనబరిచిన పారిశుధ్య కార్మికులు, మెప్మా ఆర్పీలను ట్రైనీ కలెక్టర్ అజయ్‌యాదవ్, మున్సిపల్ చైర్‌పర్సన్ గందె రాధిక సన్మానించారు. మెప్మా విభాగంలోని 10 సెల్ఫ్ హెల్ప్ గ్రూపులకు, 42 మంది వీధి వ్యాపారులకు రూ. 1.54కోట్ల రుణాల చెక్కులను పంపిణీ చేశారు. పారిశుధ్య సిబ్బందికి ఇన్సూరెన్స్ కోసం ప్రధానమంత్రి జీవన జ్యోతి బీమా, ప్రధానమంత్రి సురక్షా బీమా యోజన వార్షిక బీమాల చెల్లింపుల కోసం 68,400 రూపాయలు మున్సిపల్ పాలకవర్గం ఆమోదం తెలుపు తూ చెక్కును జారీ చేశారు. కార్యక్రమంలో ఆర్డీవో రమేష్‌బాబు, డిపూటీ డీఎంహెచ్‌వో చందు, తహసీల్దార్ కనకయ్య, హెల్త్ ఆఫీసర్ జరీనా, మేనేజర్ భూపాల్‌రెడ్డి, ఏఈ సాంబరాజు పాల్గొన్నారు.

జమ్మికుంట రూరల్: జమ్మికుంట పట్టణంలో ప్రజాపాలన విజయోత్సవ ర్యాలీని నిర్వహించారు. మున్సిపల్ చైర్మన్ తక్కళ్లపల్లి రాజేశ్వర్‌రావు, వైస్ చైర్‌పర్సన్ దేశిని స్వప్న-కోటి, కమిషనర్ మొహమ్మద్ ఆయాజ్ జెండా ఊపి ర్యాలీ ప్రారంభించారు. పాత మున్సిపల్ కార్యాలయం నుంచి పట్టణంలో మహిళ సంఘ సభ్యులు, మున్సిపల్ సిబ్బంది ర్యాలీ చేపట్టారు. అనంతరం ఓ ఫంక్షన్‌హాల్‌లో ఏర్పాటు చేసిన సమావేశంలో మున్సిపల్ సిబ్బందిని సన్మానించారు. కార్యక్రమానికి ముఖ్యఅతిథిగా రాష్ట్ర జాయింట్ డైరెక్టర్ పి శ్రీధర్ మాట్లాడుతూ జమ్మికుంట మున్సిపాలీటిలో పారిశుధ్య కార్మికులకు ఇన్సూరెన్స్, ఈఎస్ఐ కార్డులు, హెల్త్ కార్డుల పంపిణీ చేయడం సంతోషంగా ఉందన్నారు. కార్యక్రమంలో అధికారులు రాజిరెడ్డి, నరేష్, రాజశేఖర్, మహేష్, భాస్కర్, వాణి, ఆర్పీలు, ఏఎన్ఎమ్‌లు పాల్గొన్నారు.

బీఆర్ఎస్వీ ఆధ్వర్యంలో గురుకులాల బాట

తిమ్మాపూర్, డిసెంబరు 3 (ఆంధ్రజ్యోతి): మండలంలో బీఆర్ఎస్వీ ఆధ్వర్యంలో గురుకులాల బాట కార్యక్రమం మంగళవారం నిర్వహించారు. దీనిలో భాగంగా మండలంలోని మైనార్టీ గురుకుల పాఠశాల, గన్నేరువరం మండలానికి చెందిన మహాత్మా జ్యోతిబాపూలే గురుకుల పాఠశాల, కళాశాల (బాలుర)ను నాయకులు సందర్శించారు. కార్యక్రమంలో బీఆర్ఎస్వీ జిల్లా ఇన్‌చార్జి ఆవాల హరిబాబు, నాయకులు సుదగోని సదయ్య, సాగర్, హరీష్వర్మ, కౌశిక్, అజయ్, భూపతి, రాజు పాల్గొన్నారు.

అంతిమ యాత్రలో పాడె మోసిన ఎమ్మెల్యే

జమ్మికుంట, డిసెంబరు 3 (ఆంధ్రజ్యోతి): జమ్మికుంట మాజీ ఎంపీపీ, విద్యోదయ స్కూల్ చైర్మన్ ఏబూషి రామస్వామి అనారోగ్యంతో మృతి చెందగా మంగళవారం అంత్యక్రియలు నిర్వహించారు. హుజూరాబాద్ ఎమ్మెల్యే పాడి కౌశిక్‌రెడ్డి అంత్యక్రియల్లో పాల్గొని పాడె మోశారు. కుటుంబ సభ్యులకు ధైర్యం చెప్పి ఓదార్చారు. మాజీ ఎంపీపీగా, విద్యాసంస్థ చైర్మన్‌గా నిరుపేదలకు సేవలందించిన గొప్ప వ్యక్తి రామస్వామి అని కొనియాడారు.

ధాన్యం కొనుగోలు కేంద్రం సందర్శన

చిగురుమామిడి, డిసెంబరు 3(ఆంధ్రజ్యోతి): మండలంలోని సీతారాంపూర్ గ్రామంలోని ధాన్యం కొనుగోలు కేంద్రాన్ని బీఆర్ఎస్ మండల అధ్యక్షుడు మామిడి అంజయ్య మంగళవారం సందర్శించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ దాదాపు నెల రోజుల నుంచి సన్న వరి ధాన్యం కేంద్రాంలోనే ఉందన్నారు. కొనుగోలు చేయకుండా నిర్వాహకులు నిర్లక్ష్యం చేస్తున్నారన్నారు. గ్రామానికి చెందిన ఏలేటి రాజిరెడ్డి అనే రైతు 12 ఎకరాల్లో సన్న ధాన్యం పండించాడన్నారు. గత నెల 11 వ తేదీన కొనుగోలు కేంద్రానికి ధాన్యాం తీసుకు వచ్చినా నేటి వరకు కొనుగోలు చేయడం లేదన్నారు. వెంటనే కొనుగోలు చేయాలని డిమాండ్ చేశారు.

బాల్య వివాహాలపై అవగాహన సదస్సు

కరీంనగర్ టౌన్/శంకరపట్నం/తిమ్మాపూర్ డిసెంబరు 3 (ఆంధ్రజ్యోతి): కరీంనగర్ అర్బన్ ప్రాజెక్టు కిసాన్ నగర్ సెక్టార్‌లోని శివాజీనగర్ అంగన్‌వాడీ కేంద్రంలో మంగళవారం బాల్య వివాహాలు, ఆడపిల్లల అక్రమ రవాణా, బాల కార్మికుల రక్షణపై అవగాహన సదస్సు నిర్వహించారు. కార్యక్రమంలో అంగన్‌వాడీ సూపర్‌వైజర్ కళావతి మాట్లాడుతూ తల్లిదండ్రులు, పిల్లలపై ప్రత్యేకమైన దృష్టిపెట్టి వారి ప్రవర్తనను ఎప్పటికప్పుడు గమనిస్తూ ఉండాలన్నారు. శంకర మండల కేంద్రంలోని కేజీబీవీ పాఠశాలలో ఐసీడీఎస్ ఆధ్వర్యంలో పలువురు బాల్య వివాహాల వలన జరిగే అనర్థాలపై వివరించారు. కార్యక్రమంలో ప్రొటెక్షన్ ఆఫీసర్ శాంత, ఐసీడీఎస్ సూపర్‌వైజర్ స్రవంతి, ఉపాధ్యాయులు పాల్గొన్నారు. తిమ్మాపూర్ మండలంలోని పర్లపల్లిలో గల జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో జరిగిన అవగాహన కార్యక్రమంలో చైల్డ్ వెల్ఫేర్ ప్రొటెక్షన్ ఆఫీసర్ శాంతా, ఐసీడీఎస్ సూపర్‌వైజర్ పద్మ, కో ఆర్డినేటర్ రమేష్, పాఠశాల ప్రధానోపాధ్యాయులు దేవ శంకర్ పాల్గొన్నారు.

తెలంగాణ అమరుడు శ్రీకాంతాచారికి ఘన నివాళి



కేశవపట్నంలో నివాళులర్పిస్తున్న నాయకులు

కరీంనగర్ కల్చరల్, డిసెంబరు 3 (ఆంధ్రజ్యోతి): తెలంగాణ రచయితల వేదిక, వేద కమిటీ ఆధ్వర్యంలో తెలంగాణ అమరవీరుల స్థూపం వద్ద అమరవీరుడు శ్రీకాంతాచారి వర్ధంతి కార్యక్రమం మంగళవారం నిర్వహించారు. కార్యక్రమంలో గాజోజు నాగభూషణం, అన్నవరం దేవేందర్, సీవి కుమార్, సద్యాశ్రీ, దామరకుంట శంకరయ్య, విలాసాగరం రవీందర్, ఎండి ఖాలిద్, గుడికందుల అరుణ్, డి అఖిల్, నెరువట్ల చైతన్య, ఎర్రోజు వేంకటేశ్వర్లు, కుమారస్వామి, భద్రయ్య, నాగభూషణం తదితరులు పాల్గొన్నారు.

హుజూరాబాద్: పట్టణంలోని అమరవీరుల స్థూపం వద్ద జేఏసీ, ప్రజా సంఘాల ఆధ్వర్యంలో జరిగిన కార్యక్రమంలో శ్రీకాంత్‌చారి చిత్రపటానికి పూలమాలలు వేసి కొవ్వొత్తులతో నివాళులర్పించారు. కార్యక్రమంలో సదానందం, వెంకట్రాజం, ఈశ్వర్‌రెడ్డి, రత్నం, రవీందర్, సతీష్, జనార్ధన్, ప్రభాకర్, రవీందర్, వేణు, శ్రీనివాస్, నర్సింహారెడ్డి, అచ్యుత్, వెంకన్న, అమీరేందర్, సమ్మయ్య, భువనచంద్ర తదితరులు పాల్గొన్నారు.

శంకరపట్నం: మండలంలోని కేశవపట్నం బస్టాండ్ ఆవరణలో తెలంగాణ ఉద్యమకారుల ఫోరం, విశ్వబ్రాహ్మణ మండల సంఘం ఆధ్వర్యంలో జరిగిన కార్యక్రమంలో సదానందచారి, సయ్యద్ అఫ్జల్, వెంకటేశం, తిరుపతి, దేవరాజు, కృష్ణ, రవీంద్రచారి, సురేష్, లింగమూర్తి, శ్రీనివాస్, రమేష్, రవి, బాబాన్న పాల్గొన్నారు.

సంక్షిప్త సమాచారం

హుజూరాబాద్: పట్టణంలోని జిల్లా పరిషత్ బాలుర ఉన్నత పాఠశాలలో 80మంది విద్యార్థులకు గంగిశెట్టి మధురమ్మ మెమోరియల్ ట్రస్టు నిర్వాహకుడు గంగిశెట్టి జగదీశ్వర్ పరీక్ష ప్యాడ్లను అందజేశారు.

రామడుగు: మండల కేంద్రంలోని పోలీస్ స్టేషన్‌లో హెడ్ కానిస్టేబుళ్లుగా పనిచేసిన సవనాల భూమయ్య, మునిగాల రత్నంగౌడ్, బొమ్మదేని రవీందర్ బదిలీపై వెళ్తున్న సందర్భంగా మంగళవారం సన్మాన కార్యక్రమం జరిగింది. ఈ సందర్భంగా ఎస్ఐ శేఖర్ శాలువాతో సత్కరించారు.

- రామడుగు మండలంలోని గోపాల్‌రావుపేట గ్రామంలో హనుమాన్ గుడి పునర్నిర్మాణం చేపట్టుకోవచ్చని హైకోర్టు మంగళవారం ఉత్తర్వులు జారీ చేసింది. దీంతో గుడి నిర్మాణానికి లైన్ క్లియర్ అయింది. న్యాయవాది ఈ విషయాన్ని ఆలయ కమిటీ కమిటీ సభ్యులకు తెలపడంతో వారు స్వీట్లు పంచుకుంటూ సంబరాలు జరుపుకున్నారు.

- రామడుగుకు చెందిన జిట్టవేణి రేవంత్ మహారాష్ట్రలోని పూణెలోని ఛత్రపతి స్పోర్ట్స్ కాంప్లెక్స్‌లో జరిగిన నేషనల్ కరాటే చాంపియన్ షిప్ పోటీల్లో పాల్గొని అత్యుత్తమ ప్రతిభను కనబర్చి సిల్వర్ మెడల్ సాధించాడు. ఈ మేరకు మంగళవారం జిల్లా కేంద్రంలోని సీపీ కార్యాలయంలో విద్యార్థిని సీపీ అభిషేక్ మొహంతి, ట్రైనీ ఐపీఎస్ వసుందరయాదవ్ అభినందించారు.

వీణవంక: మండలంలోని ఎలుబాక గ్రామంలోని జడ్పీహెచ్ఎస్ పాఠశాలకు చెందిన వాసుదేవరెడ్డి సైన్స్‌ఫెయిర్‌లో ప్రతిభ కనబరిచాడు. జిల్లా కేంద్రంలో నిర్వహించిన వైజ్ఞానిక ప్రదర్శనలో అత్యుత్తమ ప్రతిభను కనబర్చి జిల్లా స్థాయిలో తృతీయ స్థానంలో నిలిచినట్లు పాఠశాల ప్రధానోపాధ్యాయులు అంజరెడ్డి మంగళవారం ఓ ప్రకటనలో తెలిపారు.

ఇల్లందకుంట: సంయుక్త కిసాన్ మోర్చా ఆధ్వర్యంలో బుధవారం హైదాబాద్‌లోని ఇందిరాపార్క్ వద్ద నిర్వహించే ధర్నాను విజయవంతం చేయాలని తెలంగాణ రైతు సంఘం జిల్లా కమిటీ సభ్యుడు చెల్పూరి రాము ఒక ప్రకటనలో కోరారు.

శంకరపట్నం: టీడీపీ మండల అధ్యక్షుడు సయ్యద్ ఆరిఫ్ ఇటీవల గుండెపోటుతో మృతి చెందగా, మృతుడి కుటుంబ సభ్యులను తెలుగు యువత రాష్ట్ర అధ్యక్షుడు పోగాకు జయరాం చందర్, పార్లమెంట్ కన్వీనర్ వంచ శ్రీనివాస్‌రెడ్డి, తెలుగు యువత రాష్ట్ర నాయకుడు దాసరి అవినాష్‌రెడ్డి, అడ్‌హక్ కమిటీ పార్లమెంట్ సభ్యుడు మోరె ప్రభాకర్, దయాకర్, దామెర సత్యం పరామర్శించారు. మృతుడి కుటుంబానికి వారు ఆర్థికసహాయం అందజేశారు.